
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
నల్లగొండ
5
శుక్రవారం 13 సెప్టెంబరు 2024




గరిష్ఠం 31.0
కనిష్ఠం 24.0
***

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	589.90 (311.7462)	1,23,987	1,24,943
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.85 (4.16)	1,352	483.3
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.32 (43.20)	71,863	16,000

చికెన్ ధరలు | లైవ్ : రూ.120 | డ్రెస్ : రూ.190 | స్కిన్‌లెస్ : రూ.218

పవర్ ప్లాంట్‌లో.. దొంగలు ..పడ్డారు



- రూ.100 కోట్ల మేర చోరీ సామగ్రి బయటకు వెళ్లినట్లు సందేహాలు
- పటిష్ఠ భద్రత ఉన్నప్పటికీ విచ్చలవిడిగా దొంగతనాలు
- కీలకవ్యక్తుల అండదండలతోనే అక్రమదందా
- రాజకీయ పలుకుబడితో కేసుల విచారణ నీరుగారుతోందని విమర్శలు

యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంటులో వెలుగులోకి వస్తున్న దొంగతనాలు విస్తుగొల్పుతున్నాయి. తుక్కు, పాత ఇనుము, రాగి, అల్యూమినియం వస్తువుల చోరీ జరుగుతుందనే అంశంపై 2017నుంచి అడపాదడపా కేసులు నమోదవుతున్నా కట్టడికి సీరియస్‌గా చర్యలు చేపట్టకపోవడం విస్మయానికి గురి చేస్తోంది. తాజాగా వెలుగులోకి వచ్చిన దొంగతనంతోపాటు, మూడునెలల క్రితం బయటపడిన చోరీ వ్యవహారాలతో ప్లాంటు నుంచి భారీగా ఇనుము బయటకు తరలిందని తెలుస్తోంది. కీలకమైన వ్యక్తుల ప్రమేయంతో సుమారు రూ.100 కోట్లకు పైగా విలువైన ఇనుము, సామగ్రి బయటకు వెళ్లిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.
(ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)

నల్లగొండ జిల్లా వీర్లపాలెంలో నిర్మిస్తున్న యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంటు నుంచి ఒక్క ఇనుప ముక్క బయటకు రావాలన్నా పలు తనిఖీలు జరుగుతాయని, అలాంటి చోట ఇంత భారీ చోరీలు జరుగుతుండడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దాదాపు రూ.100కోట్ల విలువైన ఇనుము, సామగ్రి ఇప్పటికే అక్రమంగా బయటకు తరలించి సొమ్ము చేసుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వెలుగులోకి వచ్చిన దొంగతనాలకే పోలీస్ విచారణ పరిమితమవుతుందే తప్ప, అంతకుమించి లోతుగా జరగడం లేదని, రాజకీయ, అధికారవర్గాల పరమైన ఒత్తిళ్లతో విచారణను అక్కడికక్కడికే పరిమితం చేస్తున్నారన్న విమర్శలున్నాయి. ప్లాంట్‌లో జరుగుతున్న దొంగతనాలు, ఇనుము అక్రమ తరలింపు, డీజిల్ చోరీ అంశాలపైనా పూర్తిస్థాయిలో విచారణ జరిపితే మొత్తం కుంభకోణం బయటకు వస్తుందని, పోలీస్ ఉన్నతాధికారులు, బీహెచ్‌ఈఎల్, జెన్‌కో అధికారులు ఈ దర్యాప్తు చేపట్టాలనే డిమాండ్ సర్వత్రా వెల్లడవుతోంది.

పటిష్ఠమైన భద్రతా వ్యవస్థ ఉన్నప్పటికీ..

రాష్ట్ర ప్రభుత్వం దాదాపు రూ.40వేలకోట్ల అంచనా వ్యయంతో దామరచర్ల మండలం వీర్లపాలెం వద్ద యాదాద్రి థర్మల్ పవర్‌స్టేషన్‌ను నిర్మిస్తోంది. ఇక్కడ భద్రత నిమిత్తం ప్లాంట్ పరిధిలో మొత్తం భారీ ప్రహరీ నిర్మించారు. ఏ వస్తువు, వ్యక్తి, వాహనం లోపలకు వెళ్లాలన్నా, బయటకు రావాలన్నా మెయిన్‌గేట్ నుంచే అనుమతిస్తారు. పైగా ప్లాంటు చుట్టూ సీసీ కెమెరాల నిఘా కూడా కొనసాగుతోంది. నిబంధనల ప్రకారం పాస్‌లు, అనుమతి పత్రాలుంటేనే ఎవరినైనా, ఏ వాహనాన్ని అయినా లోపలకుగానీ, బయటకుగానీ అనుమతించేలా భద్రతా వ్యవస్థ కొనసాగుతోంది. ప్రత్యేకంగా సీఆర్‌ఎఫ్ బలగాలు ఇక్కడ ఓ డీఎస్పీ స్థాయి అధికారి పర్యవేక్షణలో భద్రత కొనసాగిస్తుంటే, మరోవైపున సివిల్ పోలీసులు తమ పర్యవేక్షణను ఏర్పాటు చేశారు. పైగా జెన్‌కో విజిలెన్స్ కార్యాలయం ఇక్కడే ఏర్పాటు చేసింది. ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారి ఇక్కడ విజిలెన్స్ విభాగాన్ని పర్యవేక్షిస్తున్నారు. ఇంత పటిష్ఠమైన భద్రత ఉన్న ప్రాంతంలో చిన్నబోల్టు పట్టుకోవాలన్నా సామాన్యులకు వెన్నులో వణుకుపుడుతుంది. అయితే ఇక్కడ భారీగా ఇనుము, అల్యూమినియం, పాత ఇనుము, రాగి, ఉక్కు, వినియోగించిన తర్వాత వదిలేసే తుక్కు పెద్దఎత్తున చేరుతుండడంతో దీనిపై కన్నేసిన కొందరు అక్రమార్కులు వీటిని బయటకు తరలించి సొమ్ముచేసుకునేందుకు రంగంలోకి దిగారు.

కీలక స్థానాల్లో ఉన్న వారితో కుమ్మక్కేనా..?

ఇక్కడ పనిచేసే కీలకమైన స్థాయిలో ఉన్న జెన్‌కో సిబ్బందితోపాటు, బీహెచ్‌ఈఎల్‌కు చెందిన సిబ్బంది, కాంట్రాక్ట్ సంస్థల సిబ్బందితోపాటు, భద్రతా విధుల్లో ఉన్నవారు ఒక బృందంగా ఏర్పడి, బయట రాజకీయ పలుకుబడి, అధికారవర్గాల్లో చెలామణి అయ్యేవారితో కలిసి ఈ అక్రమదందాకు తెరలేపినట్లు ఆరోపణలు వస్తున్నాయి. వారి సహకారంతోనే ఇక్కడి నుంచి కోట్ల రూపాయల విలువైన ఇనుము, ఇతర సామగ్రి బయటకు తరలిందని చెబుతున్నారు. ఇక్కడ పనిచేసే కార్మికులను, ఈ ప్లాంటులోకి వచ్చే వాహనాల డ్రైవర్లు, కూలీలను, కాంట్రాక్ట్ సంస్థల్లో పనిచేసే వారిని ఇక్కడినుంచి ఇనుమును బయటకు తీసుకెళ్లేందుకు వినియోగించి ప్లాన్ ప్రకారం ఈ దొంగతనాలు నిర్వహిస్తున్నట్లు చర్చ సాగుతోంది. కీలకమైన వ్యక్తుల కనుసైగలతోనే ఈ దందా సాగుతుండడం వల్లే, అడపాదడపా పట్టుబడ్డ సంఘటనల్లోనూ విచారణను ఆ ఒక్క ఘటనకే పరిమితం చేసి వదిలేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. కూలీలు, వాహనాల డ్రైవర్లు, ఆ దొంగతనంలో పట్టుబడిన వారికే కేసును పరిమితం చేస్తున్నారే తప్ప ఈ దొంగతనాలకు మూలమైన కీలక వ్యక్తులను ఎందుకు విచారించడం లేదనే ప్రశ్నలకు సమాధానం కొరవడింది.

సమగ్ర విచారణకు డిమాండ్



ప్లాంటు నుంచి దాదాపు రూ.100 కోట్ల విలువైన సామగ్రి అడ్డదారిలో బయటకు వెళ్లిందనే ఆరోపణలు, వరుస దొంగతనాలు వెలుగులోకి వస్తున్నప్పటికీ ఈ వ్యవహారంపై సమగ్ర విచారణను చేపట్టకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధానంగా కీలకమైన అధికారులు, రాజకీయ పలుకుబడి గలిగిన వారు, అధికార వర్గాలను, పోలీసులను ప్రభావితం చేసే వ్యక్తులు ఈ వ్యవహారంలో భాగస్వాములవడం వల్లే ఈ చోరీలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. దాదాపు రూ.100 కోట్లకుపైగా విలువైన సామగ్రి బయటకు తరలినా ఇటు జెన్‌కో, అటు బీహెచ్‌ఈఎల్ ఉన్నతాధికారులు సమగ్రవిచారణ జరపకపోవడానికి వారిని ప్రభావితం చేస్తున్న కారణాలేమిటనే దానిపై పలురకాల విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా ఈ పవర్‌ప్లాంటుకి ఏ రకమైన మెటీరియల్ ఎంత వచ్చింది..? అందులో ఎంతమేర వినియోగించారు..? మిగిలిన మెటీరియల్ ప్రస్తుతం ఎంత నిల్వ ఉంది? తుక్కుగా మారింది ఎంత ? అనే రికార్డులను పరిశీలించే ప్రక్రియను జెన్‌కో, బీహెచ్‌ఈఎల్ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. అదేవిధంగా ఈ స్టాక్‌ను నిల్వ ఉంచే స్టాక్‌యార్డు భద్రత పరిస్థితి..? దొంగతనాలు వెలుగులోకి వచ్చినప్పుడు దొరికిన దొంగల వరకే కేసుని పరిమితం చేస్తున్న అంశం..? దొంగతనాలకు సూత్రధారులెవరు...? ప్లాంటునుంచి భారీస్థాయిలో ఇనుము బయటకు ఎలా వస్తుంది? విచారణ ముందుకు సాగకుండా అడ్డుపడుతున్న సూత్రధారులు ఎవరో నిజం నిగ్గుతేల్చాలని, పాత్రధారులతో పాటు సూత్రధారులపైనా చర్యలు తీసుకోవాలనే డిమాండ్ వెల్లడవుతోంది. సమగ్ర విచారణ చేపట్టకపోతే ప్రభుత్వరంగ సంస్థల ప్రతిష్ఠ దెబ్బతింటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఐజీపీ కార్యాలయానికి వసూల్ రాజా అటాచ్

- మరో ఏఎస్ఐ, హెడ్‌కానిస్టేబుల్‌పై బదిలీవేటు
- త్వరలో తదుపరి చర్యలుంటాయని ఐజీ ప్రకటన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నల్లగొండ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): మిర్యాలగూడ రూరల్ ఎస్ఐని ఐజీపీ కార్యాలయానికి అటాచ్ చేశారు. 'ఆంధ్రజ్యోతి' మినీలో ఈ నెల ఆరో తేదీన ప్రచురితమైన 'వసూల్ రాజా' కథనంపై పోలీస్‌శాఖ ఉన్నతాధికారులు స్పందించారు. మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ కే.నరేశ్‌ను జోన్ కార్యాలయానికి అటాచ్ చేశారు. ఈ మేరకు మల్టీజోన్-2 ఐజీపీ వి.సత్యనారాయణ గురువారం ఆదేశాలిచ్చారు. మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ నరేశ్ జోన్ కార్యాలయంలో రిపోర్ట్ చేయాల్సిందిగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఎస్ఐ వ్యవహారశైలిపై నల్లగొండ ఎస్పీ శరత్ చంద్రపవార్ ఇచ్చిన నివేదిక ప్రకారం ఎస్ఐపై చర్యలు తీసుకుంటున్నామని, త్వరలో తదుపరి చర్యలు కూడా ఉంటాయని ఐజీ సత్యనారాయణ తెలిపారు. అదేవిధంగా ఈ వ్యవహారాల్లో భాగస్వాములైన ఏఎస్ఐ యాదగిరిని చందంపేట పీఎస్‌కు, హెడ్‌కానిస్టేబుల్ బి.తులిసియా నాయక్‌ని చింతపల్లి పోలీస్‌స్టేషన్‌కు బదిలీచేస్తూ ఉత్తర్వులిచ్చారు. 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన రోజే ఈ వ్యవహారాలపై ఎస్పీ శరత్‌చంద్రపవార్ విచారణ చేపట్టారు. మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు స్వయంగా స్టేషన్‌కు వెళ్లి రికార్డులను పరిశీలించడంతోపాటు, ఫైళ్లను తనవెంట తీసుకెళ్లి విచారణ నివేదికను ఎస్పీకి అందజేశారు. మరోవైపు ఇంటెలిజెన్స్, ఎస్‌బీ అధికారుల ద్వారా సమగ్ర విచారణ జరిపించి పూర్తిస్థాయి నివేదికను ఎస్పీ శరత్ చంద్రపవార్ ఐజీకి నివేదించారు. విచారణలో 'ఆంధ్రజ్యోతి' కథనంలో పేర్కొన్న అంశాలన్నీ రూఢీకావడంతో ఐజీ చర్యలకు ఉపక్రమించి, గురువారం ఉత్తర్వులిచ్చారు. పోలీస్ ఠాణా బాస్‌ల అక్రమార్జన, అడ్డగోలు వ్యవహారాలపై పోలీస్ ఉన్నతాధికారులు సీరియస్ యాక్షన్‌కు దిగడంతో జిల్లాలో ఇదే తరహాలో వ్యవహరిస్తోన్న ఇతర ఠాణా బాస్‌లకీ వణుకుమొదలైంది. ఈ వ్యవహారాలపైనా ఇప్పటికే నివేదికలు ఐజీ కార్యాలయానికి, ఎస్పీకి చేరడంతో వారిపైనా త్వరలో శాఖాపరమైన చర్యలుంటాయని పోలీస్‌వర్గాల్లో చర్చ సాగుతోంది.

చిట్యాల హెడ్‌కానిస్టేబుల్ సైతం చండూరుకు బదిలీ

చిట్యాల స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఎండీ జహీరొద్దీన్‌ని చండూరు పోలీస్‌స్టేషన్‌కు అటాచ్‌చేశారు. ఈమేరకు ఎస్పీ ఉత్తర్వులిచ్చారు.

వైభవంగా నృసింహుడి కల్యాణం

- శాస్త్రోక్తంగా నిత్య పూజలు
- ఆలయ తిరువీధుల్లో ఊరేగింపు సేవ



6

- ఏపీ సీఎంతో మంత్రి ఉత్తమ్ దంపతులు



ఏపీ రాష్ట్ర సీఎం చంద్రబాబునాయుడును మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సతీమణి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డిలు విజయవాడలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. పలు అంశాలపై చర్చించారు.
- హుజూర్‌నగర్

బై బై గణేశా..



జిల్లాకేంద్రంలోని వల్లభరావు చెరువులో గణపతి నిమజ్జనం

8

జిల్లావ్యాప్తంగా వినాయక నిమజ్జనోత్సవాలు ఉల్లాసంగా.. ఉత్సాహంగా కొనసాగాయి. ఐదు రోజులపాటు పూజలందుకున్న గణనాథులు గంగమ్మ ఒడికి చేరారు.

రవాణా శాఖలో చక్రం తిప్పుతున్న ఏజెంట్లు

- అన్నింట్లోనూ వారిదే హవా
- డబ్బులిచ్చి చాటుగా పనులు చక్కబెడుతున్న వైనం
- కార్యాలయాల్లోని సిబ్బంది సహకారం

ఆంధ్రజ్యోతి విజిట్



రోడ్డు రవాణా కార్యాలయాల్లో ఏజెంట్ల హవా సాగుతోంది. ఏ పని కావాలన్నా వారికి ఎంతో కొంత ముట్టజెప్పాల్సిందే. కాదుకూడదని ఎవరైనా నేరుగా వెళ్తే అవిలేవు, ఇవి లేవూ అంటూ కార్యాలయం చుట్టూ తిప్పి విసిగి ఏజెంట్లను కలిసేలా చేస్తున్నారు. సూర్యాపేటలో ఎవరికీ దొరక్కుండా ప్రత్యేక కోడ్ విధానాన్ని పాటిస్తున్నారు. ప్రాంగణంలోనే ఉంటూ పనులు చక్కబెడుతున్నారు. అసౌకర్యాల మధ్య అద్దె భవనాల్లో కొనసాగుతున్న చోట్ల సిబ్బంది కొరత కూడా వేధిస్తోంది.
- మిర్యాలగూడ, భానుపురి, కోదాడరూరల్

మిర్యాలగూడ యూనిట్ కార్యాలయం పరిధిలో అనుముల, తిరుమలగిరి(సాగర్) చింతపల్లి, మాల్, చందంపేట, దామరచర్ల, అడవిదేవులపల్లి, దేవరకొండ, డిండి(గుండ్లపల్లి), మిర్యాలగూడ, నిడమనూరు, పీఏపల్లి, పెద్దవూర, త్రిపురారం, వేములపల్లి మండలాల ప్రజలకు వాహన రిజిస్ట్రేషన్, ఫిట్‌నెస్ సేవలు అందిస్తున్నారు. క్వాటర్లీ పన్ను, లైఫ్‌ట్యాక్స్, సర్వీసు,ఫీజుల రూపేణ కార్యాలయం, ఈ-సేవ, ఆన్‌లైన్ ద్వారా ఏటా కోట్ల రూపాయల ఆదాయం సమకూరుతోంది. గత ఏడాదిలో ఇక్కడి నుంచే రూ.52 కోట్ల ఆదాయం ప్రభుత్వానికి సమకూరినట్లు తెలుస్తోంది. అయినప్పటికీ సౌకర్యాలు కల్పించడంలో మాత్రం నిర్లక్ష్యం వహిస్తున్నారు. అదేవిధంగా మిర్యాలగూడ కార్యాలయంలో ఏవో పోస్ట్ ఖాళీగా వుంది.

ప్రతి పనికీ ఖరీదు

రవాణా శాఖా కార్యాలయాల్లో ఏజెంట్లు, సిబ్బంది దరఖాస్తుదారుల నుంచి మామూళ్ల వసూలు చేస్తున్నారు. ప్రతి పనికీ ఇంత అంటూ డిమాండ్ చేస్తున్నారు. డ్రైవింగ్ లైసెన్స్‌కు రూ.500, ట్రాక్టర్, కారు లాంటి వాహనాలకు రూ.1200 నుంచి రూ.1500 వరకు ఏజెంట్లు కార్యాలయంలో ముట్టజెప్పుతున్నారు.

సూర్యాపేట జిల్లాలో

సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఆర్టీవో కార్యాలయంలో ఏజెంట్ల దందా గుట్టుచప్పుడుగా కొనసాగుతోంది. సుమారు 10మంది ఏజెంట్ల హవా ఇక్కడ నడుస్తోంది. దరఖాస్తులకు ఇంతా అన్నట్లు ఇద్దరు ఉద్యోగులు సాయంత్రం ఏజెంట్ల వద్దకు వెళ్లి తీసుకుంటున్నట్లు సమాచారం. వాహనాన్ని బట్టి వేలల్లో ముట్టజెప్పాల్సి వస్తోంది. ఏజెంట్ల ద్వారా కాకుండా నేరుగా వెళ్లిన వాహనదారుడికి పనులు కావడం లేదు. అదేవిధంగా కోదాడలో ఎంవీఐ బిల్డింగ్ కోసం అనేకసార్లు ప్రతిపాదనలు పంపించినా అనుమతి రావడం లేదు. అనంతగిరి మండలం శాంతినగర్ వద్ద నాలుగున్నర ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా, అందులో నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. భూమి కేటాయిస్తే కార్యాలయం నిర్మాణానికి అడ్డంకులు తొలగిపోతాయి.

డ్రైవింగ్ టెస్ట్‌కు ట్రాకే లేదు

మిర్యాలగూడ రవాణా శాఖ కార్యాలయానికి వింత పరిస్థితి. లెర్నింగ్ లైసెన్స్ కాలపరిమితి 30 రోజుల తర్వాత ఎంవీఐ ఎదుట దరఖాస్తుదారుడు వాహనాన్ని నడపాల్సి ఉంటుంది. అయితే ఇక్కడే డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్ లేకపోవడం విశేషం. 25 ఏళ్ల కిందట మిర్యాలగూడ-గూడూరు రోడ్డులో ఎంవీఐ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. సుమారు సరాసరి రోజుకు 50కి పైగా వాహనాలు రిజిస్ట్రేషన్, ఫిట్‌నెస్‌ల కోసం వస్తుంటాయి. కాగా కార్యాలయం తప్ప ఖాళీ స్థలం లేకపోవడంతో ప్రైవేటు వ్యక్తులకు చెందిన స్థలంలోనే డ్రైవింగ్ టెస్ట్‌లు, ఫిట్‌నెస్ టెస్టులు నిర్వహించేవారు. చుట్టుపక్కల భూయజమానులు ఆయా స్థలాల్లో నిర్మాణాలు చేపట్టారు. దీంతో వాహనాలను నిలిపి ఉంచేందుకు సైతం ఇబ్బందిగా మారింది.

నేరుగా వచ్చి లైసెన్సులు పొందవచ్చు



ఏజెంట్ల ద్వారా లైసెన్సులు మంజూరుకు డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు నా దృష్టికి రాలేదు. ఆన్‌లైన్‌ద్వారా దరఖాస్తు చేసుకున్నా డ్రైవింగ్ లైసెన్సులు మంజూరు చేస్తున్నాం. ట్రాక్ లేకున్నా మైదానంలో టెస్ట్‌లు నిర్వహించి లైసెన్సులు మంజూరు చేస్తున్నాం. డ్రైవింగ్ ట్రాక్, ఫిట్‌నెస్ స్టేషన్ అవసరాల కోసం గూడూరు, కిష్టాపురంలో ఎనిమిది ఎకరాల స్థలాన్ని పరిశీలిస్తున్నాం.
- వీరస్వామి, ఎంవీఐ , మిర్యాలగూడ

ప్రజాపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

- కలెక్టర్ సి.నారాయణరెడ్డి



కలెక్టర్ నారాయణరెడ్డి

నల్లగొండ టౌన్, సెప్టెంబరు 12: ప్రజాపాలన దినోత్సవాన్ని ఈ నెల 17న ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించిందని కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. ఇందుకుగాను అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని ఆయన జిల్లా అధికారులను ఆదేశించారు. 17వ తేదీన నిర్వహించనున్న ప్రజాపాలన దినోత్సవ ఏర్పాట్లపై గురువారం ఆయన జిల్లా అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. 17వ తేదీన జిల్లాకేంద్రం మొదలుకొని, గ్రామపంచాయతీ వరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, స్థానిక సంస్థలు, గ్రామపంచాయతీల్లో జాతీయ పతాకాన్ని ఎగురవేయాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాకేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో 17వ తేదీ ఉదయం 10 గంటలకు రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారని, పోలీసు గౌరవ వందనంతోపాటు, జిల్లా ప్రజలనుద్దేశించి సందేశం ఇస్తారని చెప్పారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులతో సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయన్నారు. ఎస్పీ శరత్ చంద్రపవార్ మాట్లాడుతూ పోలీస్ పరేడ్ మైదానంలో ప్రజాపాలన దినోత్సవ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లతోపాటు, పోలీస్ గౌరవ వందనానికి, అలాగే బందోబస్తు ఏర్పాట్లు చేస్తామని, ఇందుకోసం ప్రత్యేకంగా ఒకరిని నోడల్ అధికారిగా నియమించనున్నట్లు తెలిపారు. అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాలమేరకు అవసరమైన అన్ని ఏర్పాట్లను చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు వారి వారి శాఖలకు సంబంధించి చేసే ఏర్పాట్లపై మాట్లాడారు. టెలీ కాన్ఫరెన్స్‌లో అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సెలవు దినాల్లో సైతం పని చేయాలి

- అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్

రామగిరి, సెప్టెంబరు 12: కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు సెలవు దినాల్లో సైతం పనిచేయాల్సిందేనని అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ అన్నారు. గురువారం మిల్లర్లు, పౌరసరఫరాల శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023-24 వానాకాలం, యాసంగికి సంబంధించిన సీఎంఆర్‌ను చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ నెలాఖరు వరకు గడువు విధించిందన్నారు. గడువు 18 రోజులు మాత్రమే మిగిలి ఉన్నందున సెలవురోజుల్లో సైతం పనిచేసి లక్ష్యాన్ని సాధించాలన్నారు. 2023 వానాకాలం సీఎంఆర్ ఏ ఒక్కరికి పెండింగ్‌లో లేకుండా పూర్తి చేయాలన్నారు. ఇందుకు పౌరసరఫరాల అధికారులు, సిబ్బంది సమన్వయం చేసుకొని పనిచేయాలన్నారు. కార్యక్రమంలో డీఎస్‌వో వెంకటేశ్వర్లు, ఎఫ్‌సీఐ మేనేజర్ రఘుపతి, రైస్ మిల్లర్ల సంఘం ఉపాధ్యక్షుడు హనుమంతు, కార్యదర్శులు, మిల్లర్లు, ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి : డీఈవో

చిట్యాలరూరల్, సెప్టెంబరు 12: విద్యార్థులు కష్టపడి చదివి, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జిల్లా విద్యాధికారి బొల్లారం భిక్షపతి అన్నారు. చిట్యాల మండలం గుండ్రాంపల్లి జడ్పీహెచ్‌ఎస్‌ను గురువారం డీఈవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదుల్లో ఉపాధ్యాయుల బోధనలు, విద్యార్థుల పఠనాన్ని పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులతో డీఈవో కాసేపు ముచ్చటించారు. విద్యాబోధన అనంతరం పాఠ్యపుస్తకాల పఠనంతో మెరుగైన ఫలితాలను సాధించవచ్చని సూచించారు. ఉపాధ్యాయులతో సమావేశమై విద్యార్థులకు బోధించే బోధనల గురించి అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం వంటలను పరిశీలించి నాణ్యమైన రుచికరంగా వంటలు వండాలని, విద్యార్థులకు రుచికరమైన భోజనం పెట్టాలని, ఉపాధ్యాయులు పర్యవేక్షించాలన్నారు. ప్రతీ విద్యార్థిపై ప్రత్యేకశ్రద్ధ చూపుతూ బోధనలు చేయాలని, బోధన అనంతరం పాఠ్యాంశాలను పఠనం చేయించాలన్నారు. విద్యార్థులు నిత్యం పాఠశాలకు హాజరుకావాలని, క్రమం తప్పకుండా హాజరయ్యేందుకు ఉపాధ్యాయులు విద్యార్థులకు సూచనలు చేయాలని, విద్యార్థుల హాజరుశాతాన్ని ఖచ్చితంగా పెంచాలన్నారు. డీఈవో వెంట ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, వెంకట్‌రావు, రాంరెడ్డి, షరీఫ్ ఉన్నారు.



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈవో భిక్షపతి

సీతారాం ఏచూరికి నివాళి



8

జిల్లాకేంద్రంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న సీపీఎం నేతలు

సీతారాం లేని లోటు పూడ్చలేనిది

- శాసనమండలి చైర్మన్ గుత్తా

రామగిరి, సెప్టెంబరు 12: సీతారాం ఏచూరి లేని లోటు పూడ్చలేనిదని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాజ్యసభ సభ్యుడిగా, సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడిగా, సామాజిక కార్యకర్తగా సీతారాం ఎన్నో సేవలు చేశారని అన్నారు. ఆయన మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు.

అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

- డీఆర్‌డీఏ పీడీ శేఖర్‌రెడ్డి



సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న శేఖర్‌రెడ్డి

వేములపల్లి, సెప్టెంబరు 12: జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టే పనుల్లో ఎలాంటి అక్రమాలకు పాల్పడినా కఠినంగా వ్యవహరించాల్సి వస్తుందని డీఆర్‌డీఏ పీడీ శేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో 2023-24 సంవత్సరానికి నిర్వహించిన 13వ విడత సామాజిక తనిఖీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ ఆర్థిక సంవత్సరానికి మండలంలోని 12 గ్రామపంచాయతీల పరిధిలో 7,767 జాబ్‌కార్డులుండగా, మొత్తం 17,037 మంది కూలీలు ఉన్నారన్నారు. వీరికి ఈ ఆర్థిక సంవత్సరంలో 1,64,298 పని దినాలు కల్పించినట్లు తెలిపారు. నిబంధనలు అతిక్రమించిన ముగ్గురు టీఏలతోపాటు ఈసీ, ఎఫ్ఏలకు రూ.11వేల జరిమానా విధించామన్నారు. మరికొంత మంది ఎఫ్ఏల నుంచి రూ.9,754 రికవరీకి ఆదేశించినట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు నిత్యం సమన్వయంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ ఆఫీసర్ సీహెచ్.వేణుగోపాల్‌రావు, అంబుడ్స్‌మెన్ ఎండీ.ఘోరి, ఎంపీడీవో శారద, అసిస్టెంట్ మేనేజర్ గౌతమి, ఏపీవో మిరాజొద్దీన్, కార్యదర్శులు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

నీటిసంరక్షణ పనులు వేగవంతం చేయాలి

మిర్యాలగూడ అర్బన్: జలనిధి కార్యక్రమంలో భాగంగా నీటిసంరక్షణ పనులు వేగవంతం చేయాలని డీఆర్‌డీవో పీడీ శేఖర్‌రెడ్డి సూచించారు. మండలపరిషత్ కార్యాలయంలో గురువారం మిర్యాలగూడ, దామరచర్ల, అడవిదేవులపల్లి, త్రిపురారం, నిడమనూరు, తిరుమలగిరిసాగర్, పెద్దవూర, అనుముల మండలాల మండల పరిషత్ అధికారులు, ఈజీఎస్ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిర్యాలగూడ క్లస్టర్ పరిధిలోని అన్ని మండలాల్లో జలనిధి పథకం కింద సహజవనరుల పరిరక్షణ పనులను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. సమావేశంలో ఎంపీడీవోలు శేషగిరిశర్మ, కృష్ణమూర్తి, ఉమాదేవి, క్లస్టర్ ఏపీడీ బాలకృష్ణ, ఏపీవోలు, టీఏలు, ఎఫ్ఏలు తదితరులు పాల్గొన్నారు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు



ప్రాకార మండపంలో తిరువీధి సేవ నిర్వహిస్తున్న అర్చకస్వాములు

భువనగిరి అర్బన్, సెప్టెంబరు 12: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దివ్యక్షేత్రంలో గురువారం నిత్య కైంకర్యాలు పాంచారాత్రాగమశాస్త్ర రీతిలో వైభవంగా నిర్వహించారు. ప్రధానాలయ నైరుతి దిశలో అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవ మూర్తులను పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు, వజ్రవైఢూర్యాలతో దివ్యమనోహరంగా అలంకరించి ఆచార్యులు గజవాహన సేవలో తీర్చిదిద్ది వేదమంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల నడుమ సేవోత్సవం చేపట్టారు. ఉత్సవమూర్తులను కల్యాణమండపంలో అధిష్ఠింపజేసి, విశ్వక్సేనుడి తొలిపూజలతో కల్యాణతంతు నిర్వహించారు. కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులను అర్చకులు స్వామివారి శేషవస్త్రాలు అందజేసి ఆశీర్వచనం చేశారు. ముందుగా సుదర్శన శతక పఠనంతో హోమం పూజలు నిర్వహించారు. ప్రభాతవేళ గర్భాలయంలో స్వామిఅమ్మవారలను సుప్రభాత సేవతో మేల్కొలిపి అర్చకస్వాములు నిజాభిషేకం, నిత్యార్చనలు చేపట్టారు. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు సాంప్రదాయ రీతిలో జరిగాయి. శివాలయంలో శ్రీపర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామికి నిత్య పూజలు, యాగశాలలో నిత్య రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 11,41,912 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు.

ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన ఉండాలి

నాగార్జునసాగర్, సెప్టెంబరు 12: ఎయిడ్స్ నియంత్రణపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, అవగాహనతోనే ఆ వ్యాధిని నివారించవచ్చని ఎయిడ్స్ నియంత్రణ అధికారి మచ్యానాయక్ అన్నారు. గురువారం ఆయన సాగర్ హిల్‌కాలనీ బీసీ గురుకుల కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థులకు ఎయిడ్స్ వ్యాధి గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజశేఖర్, ప్రోగ్రాం ఆఫీసర్ కృష్ణ, నర్సింహ, అధ్యాపకులు పాల్గొన్నారు.

సాగర్‌లో 10గేట్లు ఎత్తి నీటి విడుదల

● కొనసాగుతున్న విద్యుదుత్పత్తి

నాగార్జునసాగర్, సెప్టెంబరు 12: నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద రాక పెరగటంతో గురువారం సాయంత్రం 10 గేట్లను ఎత్తి దిగువకు నీటి విడుదల చేస్తున్నారు. గురువారం వరద రాక పెరగడంతో ఉదయం 9 గంటలకు 2 క్రస్ట్ గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేసిన అధికారులు మధ్యాహ్నం 3 గంటలకు మరో 6 గేట్లు, సాయంత్రం 6 గంటలకు మరో 2గేట్లు మొత్తం 10 గేట్లనుంచి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్‌కు ఎగువన ఉన్న శ్రీశైలం నుంచి 1,23,987 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. సాగర్ ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 590 అడుగులు (312.0450టీఎంసీలు) కాగా గురువారం సాయంత్రానికి 589.90 అడుగులుగా(311.7462టీఎంసీలు) ఉంది. సాగర్ నుంచి కుడికాల్వ ద్వారా 9387 క్యూసెక్కులు, ఎడమకాల్వ ద్వారా 3146 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,110 క్యూసెక్కులు, ఎస్‌ఎల్‌బీసీ ద్వారా 1800 క్యూసెక్కులు, వరదకాల్వ ద్వారా 600 క్యూసెక్కులు, మొత్తం 26 గేట్లలో 10 గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 80,900 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 1,24,943 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా ఎగువ నుంచి 1,23,987 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది.



నాగార్జునసాగర్‌లో 10 గేట్ల ద్వారా కొనసాగుతున్న నీటి విడుదల

మూసీ ఆయకట్టుకు రెండో విడత సాగునీటి విడుదల

కేతేపల్లి: మూసీ ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల ఆయకట్టులో సాగు చేసిన వానాకాలం పంటలకు రెండో విడత నీటిని గురువారం విడుదల చేశారు. కుడికాల్వకు 241.65 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 241.65క్యూసెక్కుల చొప్పున విడుదల చేశారు. 15రోజుల పాటు కాల్వలకు నీటి విడుదల కొనసాగనుంది.

దుర్వాసన భరించలేం.. ఇంటికి వెళ్లిపోతున్నాం



కోళ్ల ఫారంను తొలగించాలని ధర్నా చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

దేవరకొండ, సెప్టెంబరు 12: పాఠశాల పక్కనే కోళ్లఫారం ఉండటంతో దుర్వాసన భరించలేక ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఇంటిబాట పట్టారు. గురువారం నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం పెంచికల్‌పహడ్‌లో ఈ సంఘటన జరిగింది. పెంచికల్‌పహడ్ ఆదర్శ గురుకుల పాఠశాలలో ఆరు నుంచి 12 తరగతులు ఉండగా, 540మంది బాలురు, బాలికలు విద్యనభ్యసిస్తున్నారు. 100మంది వరకు విద్యార్థినులు ఆదర్శ పాఠశాలలోని హాస్టల్‌లో ఉంటుండగా, మిగిలిన విద్యార్థులు రోజువారీగా ఇంటికి వెళ్లి వస్తుంటారు. పాఠశాల పక్కనే కోళ్లఫారం ఏర్పాటు చేయడంతో దుర్వాసన భరించలేకపోతున్నామని కొద్దిరోజుల క్రితం ప్రిన్సిపల్‌కు ఫిర్యాదు చేశారు. గురువారం ప్రార్థన అనంతరం విద్యార్థులు తరగతులను బహిష్కరించి ఇంటిబాట పట్టారు. ప్రిన్సిపాల్ నచ్చచెప్పినప్పటికి విద్యార్థులు వినకుండా తల్లిదండ్రులకు ఫోన్‌చేసి గ్రామాలకు వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఎఫ్‌ఐ, ఏబీవీపీ విద్యార్థి సంఘాలు ఆదర్శ పాఠశాల ఎదుట విద్యార్థులతో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం దేవరకొండ ఎంఈవో మాత్రునాయక్‌కు, ఇంచార్జ్ ఎంపీడీవో నీలిమాకు విద్యార్థి సంఘాల నేతలు వలమాల గోపిచంద్, వెంకటేశ్వర్లు ఫిర్యాదు చేశారు. కోళ్లఫారంను అక్కడి నుంచి తొలగించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

కుంటలో పడి కాడెడ్లు మృతి



నీటికుంటలో మృత్యువాత పడిన ఎద్దులు

గుండాల, సెప్టెంబరు 12: యాదాద్రిభువనగిరి జిల్లా గుండాల మండలంలోని సీతారాంపురం గ్రామంలో నీటి కుంటలో పడి గురువారం సాయంత్రం రెండు కాడెడ్లు మృతి చెందాయి. గ్రామానికి చెందిన చేగూరి పాండు తన చెలకలోని పత్తి చేనులో గుంటుక తోలి తిరిగి సాయంత్రం బావి వద్దకు అరకతో వెళుతుండగా పానాది బాటలో గుర్తు తెలియని వాహనం ఎదురు కావడంతో ఎడ్లు బెదిరి కుంట వైపు పరిగెత్తాయి. నీటికుంటలో పడ్డాయి. ఆ కుంట నిండా నీళ్లు ఉండడం, ఎద్దుల మెడలపై కాడి, గుంటుక కట్టి ఉండడంతో బయటికి రాలేక, నీట మునిగి అక్కడికక్కడే మృతి చెందాయి. రైతు పాండు చాలా సేపు అయ్యాక గమనించడంతో అప్పటికే మృత్యువాతపడ్డాయి. ఏఎస్ఐ శ్రీనివాస్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని గ్రామస్థుల సహకారంతో ఎక్స్‌కవేటర్ సాయంతో ఎడ్లను కుంటలోంచి బయటకు తీశారు. సుమారు రూ.1.50లక్షల నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని రైతు పాండు కోరాడు.

గుట్కా ప్యాకెట్ల పట్టివేత

వలిగొండ, సెప్టెంబరు 12: అక్రమంగా నిల్వ చేసిన గుట్కా ప్యాకెట్లను గురువారం పోలీసులు పట్టివేశారు. ఎస్ఐ యుగేందర్ తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రంలో మురారిశెట్టి కుమార్ అనే వ్యక్తి తన ఇంట్లో నిషేధిత గుట్కా, పొగాకును నిల్వ చేసి విక్రయిస్తున్నాడని విశ్వసనీయ సమాచారం మేరకు అతడి ఇంట్లో సోదాలు నిర్వహించారు. మిరాజ్ గుట్కా 66 పెట్టెలు, ఆర్ఆర్ గుట్కా 93 ప్యాకెట్లు, సాగర్ గుట్కా 49 ప్యాకెట్లు, వీ1 గుట్కా 29 ప్యాకెట్లు, ఎస్ఆర్ఐ 82 ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. సుమారు వాటి విలువ రూ.7,044 ఉందని, సదరు వ్యాపారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

హైడ్రా పేరుతో విలేకరినంటూ బెదిరింపులు

» బాధితుడి ఫిర్యాదు.. నిందితుడి అరెస్టు

పటాన్‌చెరు, సెప్టెంబరు 12: తాను పత్రికా విలేకరినంటూ డబ్బుల కోసం బిల్డర్‌పై బెదిరింపులకు పాల్పడుతున్న ఒకరిని పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. హైదరాబాద్ నగర శివారులోని సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని బీరంగూడ సీబీఆర్ కాలనీలో బిల్డర్ జన్వాడ రవి ఓ భవనాన్ని నిర్మిస్తున్నారు. అయితే, రామచంద్రాపురం సాయి నగర్‌కు చెందిన దగుడు రాము(42).. తనకు హైడ్రా కమిషనర్ రంగనాథ్, ఆర్డీవో, తహసీల్దార్ తెలుసునని, పాతబస్తీకి చెందిన పహిల్వాన్లతో తనకు పరిచయాలున్నాయని, నిర్మిస్తున్న భవనంపై కథనాలు రాసి కూల్చివేయిస్తానని బిల్డర్‌ను బెదిరించాడు. తనకు రూ.5 లక్షల ఇవ్వాలని లేదంటే తన పత్రికలో భవనం ఫొటో వేసి వార్తలు ప్రచురిస్తానని హెచ్చరించాడు. దీంతో బిల్డర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి నిందితుడు రామును అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు అమీన్‌పూర్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపారు. పటాన్‌చెరు నియోజకవర్గం పరిధిలో కొందరు పత్రికలు, యూట్యూబ్ ఛానళ్ల ప్రతినిధుల పేరుతో డబ్బుల కోసం కొందరు బెదిరిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అలాంటి వారిపై కేసులు నమోదు చేస్తామని పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి హెచ్చరించారు.

ఇక్కడ ఉండొద్దు ఖాళీ చెయ్యండి

» సున్నం చెరువు నిర్వాసితులకు హైడ్రా ఆదేశం

» ప్రత్యామ్నాయం చూపాలని బాధితుల వేడుకోలు

రాయదుర్గం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్, మాదాపూర్ సున్నం చెరువులో ఆక్రమణలను నాలుగు రోజుల క్రితం కూల్చేసిన హైడ్రా అధికారులు ఆ ప్రాంతాన్ని గురువారం మరోసారి పరిశీలించారు. ఆ స్థలంలో గుడిసెలు వేసుకున్న వారిని వెంటనే ఖాళీ చేసి వెళ్లిపోవాలని, గుడిసెలను కూడా తొలగించాలని ఆదేశించారు. ఆ స్థలంలో నివాసముండకూడదని స్పష్టం చేశారు. అయితే, చిన్నపిల్లలతో ఉన్న తాము ఇప్పటికిప్పుడు ఎక్కడికి వెళ్లాలని వారంతా ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వమే తమకు ప్రత్యామ్నాయం చూపాలని వేడుకున్నారు.

సున్నం చెరువు పరిధిపై రీసర్వే చెయ్యండి

ఎస్ఐఈటీ ఎంప్లాయిస్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ వినతి

పంజాగుట్ట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కష్టపడి సంపాదించిన పైసా పైసా కూడబెట్టి భూమిని కొనుగోలు చేసి అన్ని అనుమతులతో తాము నిర్మించుకున్న ఇళ్లను ఎఫ్‌టీఎల్ పేరుతో కూల్చివేయడం అన్యాయమని ఎస్ఐఈటీ(స్మాల్ ఇండస్ట్రీస్ ఎక్స్ టెన్షన్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్) ఎంప్లాయిస్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ప్లాట్ల యజమానులు వాపోయారు. సున్నం చెరువు పరిధిపై రీ సర్వే చేయించి తమకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆ సొసైటీ అధ్యక్షుడు టీఎస్ఎస్ రాజు, ఇతర సభ్యులు మాట్లాడారు. శేరిలింగంపల్లి మండలం గుట్టల బేగంపేటలోని సర్వే నెంబర్ 12, 12ఏ,13లోని 24 ఎకరాల ప్రైవేట్ భూమిని 1990లో కొనుగోలు చేయగా, 1992లో హెచ్ఎండీఏ అనుమతులతో సొసైటీ సభ్యులకు కేటాయించామని తెలిపారు. ఆయా స్థలాలకు యూఎల్‌సీ, ఎల్ఆర్ఎస్, ఆస్తి పన్ను చెల్లించామని చెప్పారు. అన్ని అనుమతులు పొందడంతో కొందరు ఆ స్థలంలో ఇళ్లు నిర్మించుకున్నారని, కొందరు తాత్కాలిక నిర్మాణాలు చేపట్టారని వివరించారు. సున్నం చెరువు పరిధిపై రీ సర్వే చేయించి ఎఫ్‌టీఎల్ పరిధిని నిర్ణయించాలని, ఒక వేళ భూమి అంతా ప్రభుత్వం తీసుకుంటే తమకు ప్రత్యామ్నాయం చూపాలని డిమాండ్ చేశారు.

మూడ్రోజులుగా నిలిచిన 'మీ-సేవ'!

» సర్వర్‌లో సాంకేతిక సమస్య.. రెండ్రోజులు పట్టే అవకాశం

బోయిన్‌పల్లి, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా మీ-సేవా కేంద్రాల్లో గత మూడ్రోజులుగా పౌర సేవలు నిలిచిపోయాయి. రాష్ట్ర స్థాయిలో వివిధ విభాగాలు, శాఖల సర్వర్లలో మార్పులు చేర్పులు చేస్తున్న నేపథ్యంలో ప్రధాన సర్వర్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో ఈ పరిస్థితి ఎదురైంది. మూడ్రోజులుగా సేవలు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన సర్వర్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో సేవలు నిలిచాయని, మరో రెండ్రోజుల్లో పునరుద్ధరించే అవకాశాలున్నాయని అధికారులు చెబుతున్నారు.

బిల్లులు రాలేదని బడికి తాళం వేసిన కాంట్రాక్టర్

కామారెడ్డి రూరల్, సెప్టెంబరు 12: పాఠశాలలో చేసిన భవన నిర్మాణ పనులకు బిల్లులు రాలేదని ఓ కాంట్రాక్టర్ బడికి తాళం వేశాడు. ఈ సంఘటన కామారెడ్డి జిల్లాలో జరిగింది. కామారెడ్డి మండలంలోని చిన్నమల్లారెడ్డి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో కాంట్రాక్టర్ నిఖిల్ భవన నిర్మాణ పనులను ఏడాదిన్నర క్రితం చేపట్టారు. అప్పటి నుంచి బిల్లులు రాకపోవడంతో ఆవేదనకు గురై గురువారం బెంచీలు బయటవేసి, తరగతి గదులకు తాళం వేశాడు. దీంతో విద్యార్థులు బయట ఉన్న చెట్ల కింద కూర్చోవాల్సి వచ్చింది. కాంట్రాక్టర్ తీరుపైన ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న పాఠశాల విద్యాకమిటీ సభ్యులు, గ్రామస్థులు కాంట్రాక్టర్‌కు సర్ది చెప్పడంతో తాళాలు తీశాడు.

ఇన్‌స్టా రీల్‌తో చిన్నారులకు పెద్ద సాయం

తల్లిని కోల్పోయిన పిల్లలకు రూ.21లక్షలు ఇచ్చిన దాతలు

నర్సింహులపేట(మహబూబాబాద్ జిల్లా), సెప్టెంబరు 12 : సోషల్ మీడియాను సక్రమంగా వాడుకుంటే అద్భుతాలు జరుగుతాయి, ఎన్నో సమస్యలు ఇట్టే పరిష్కారమవుతాయి అనేందుకు ఉదాహరణగా నిలిచే ఘటన మహబూబాబాద్ జిల్లాలో జరిగింది. తల్లిని కోల్పోయిన అభం శుభం తెలియని ఇద్దరు చిన్నారులకు మానవత్వం కలిగిన ఎన్నో హృదయాలు అండగా నిలిచాయి. ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ రీల్‌ను చూసి స్పందించిన దాతలంతా కలిసి ఆ చిన్నారులకు ఏకంగా రూ.21 లక్షలు ఆర్థిక సాయం చేసి ఔరా అనిపించారు. వివరాలిలా ఉన్నాయి.. మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం బొజ్జన్నపేటకు చెందిన బేతమల్ల నరేష్, ఉమ దంపతులకు ఐదేళ్ల క్రితం వివాహమైంది. నరేష్ తాపి మేస్త్రీగా పని చేస్తుంటాడు. ఈ దంపతులకు ఓ కుమార్తె(3), ఓ కుమారుడు(నెలన్నర) ఉన్నారు. అయితే, కొడుకును ప్రసవించిన ఎనిమిది రోజులకు, జూలై 28న ఉమ బ్రెయిన్ స్ట్రోక్ గురై మరణించింది. నిరుపేద అయిన తండ్రి, లోకం తెలియని ఆ పిల్లల పరిస్థితిని తెలుసుకున్న మహబూబాబాద్ జిల్లా కురివికి చెందిన సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్ గంగరబోయిన రఘు చలించిపోయారు. నరేష్ ఇంటికి వెళ్లి వారి పరిస్థితిని వివరించేలా ఓ వీడియో చేసి ఆ పిల్లలకు సాయం చేయాలని కోరుతూ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు. రఘు పిలుపునకు స్పందించి ముందుకొచ్చిన దాతలు ఆర్థిక సాయం పంపారు. దాతల పంపిన మొత్తం రూ.21 లక్షలు అవ్వగా.. ఆ సొమ్మును చిన్నారుల పేరిట మహబూబాబాద్ ఎస్‌బీఐలో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ఇందుకు సంబంధించిన పత్రాలను నరేష్‌కు గురువారం అందజేశారు. ఆ చిన్నారులకు ఇంత సాయం అందడానికి కారణమైన గంగరబోయిన రఘును పలువురు అభినందించారు.

ట్రాఫిక్ ఉల్లంఘనలకు.. లైసెన్స్ రద్దు!

» ప్రమాదాల పెరుగుదల నేపథ్యంలో కఠిన చర్యలకు రవాణా శాఖ కసరత్తు..


హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనదారులపై మరింత కఠినంగా వ్యవహరించాలని రవాణా శాఖ నిర్ణయించింది. మోటార్ వాహన చట్టం ప్రకారం చర్యలకు రంగం సిద్ధం చేస్తోంది. ఇక నుంచి రాంగ్ రూట్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, అతి వేగం, రేసింగ్‌లు తదితర ఉల్లంఘనల విషయంలో కూడా సీరియస్‌గా వ్యవహరించనున్నారు. మద్యం సేవించి వాహనం నడపడం, నిర్లక్ష్యపు డ్రైవింగ్ వంటి ఉల్లంఘనలకు మాత్రమే ప్రస్తుతం కోర్టు ఆదేశాలు, పోలీసుల సిఫారసు మేరకు 3 నుంచి 6 నెలల పాటు లైసెన్స్‌లను సస్పెన్షన్‌లో పెడుతున్నారు. మిగతా ఉల్లంఘనలకు సంబంధించి డ్రైవింగ్ లైసెన్స్ సస్పెండ్ చేయడం లేదు. ఈ నేపథ్యంలో చిన్న చిన్న ఉల్లంఘనలకు సంబంధించి కూడా ఇకపై లైసెన్స్‌లు సస్పెన్షన్‌లో పెట్టనున్నట్టు రవాణా శాఖ వర్గాలు తెలిపాయి. మెజార్టీ రోడ్డు ప్రమాదాలకు వాహనదారులు నిబంధనలు పాటించకపోవడం కారణమని గుర్తించిన నేపథ్యంలో నిబంధనల కచ్చిత అమలుకు అవసరమైన చర్యలు చేపడుతున్నారు. కాగా, గత రెండున్నరేళ్లలో వివిధ ఉల్లంఘనలకు సంబంధించి 26 వేలకుపైగా డ్రైవింగ్ లైసెన్స్‌లను రవాణా శాఖ సస్పెండ్ చేసింది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాల పరిధిలో 2022-23లో అత్యధికంగా 16 వేలకు పైగా లైసెన్స్‌లు సస్పెండ్ చేశారు. 2023-24లో 7 వేలకు పైగా.. ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు 2,200 లైసెన్స్‌లు సస్పెన్షన్‌లో పెట్టారు.

రాహుల్‌ను ప్రధానిని చేయడమే లక్ష్యంగా కార్యాచరణ

» ఢిల్లీలో ఏఐసీసీ చీఫ్ ఖర్గేతో మహేష్‌కుమార్ గౌడ్ భేటీ

» ఉప ఎన్నికలు రాకపోవచ్చన్న టీపీసీసీ కొత్త అధ్యక్షుడు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే లక్ష్యంగా తన కార్యాచరణ ఉంటుందని టీపీసీసీ అధ్యక్షుడిగా కొత్తగా నియమితులైన మహేష్‌కుమార్‌గౌడ్ తెలిపారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా ఆయన తన కుటుంబసభ్యులతో పాటు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను రాజాజీమార్గ్‌లోని నివాసంలో కలుసుకున్నారు. అనంతరం మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ ఖర్గే ఆశీర్వాదం కోసం వచ్చినట్లు తెలిపారు. అన్ని వర్గాలను కలుపుకుని కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని ఖర్గే సూచించినట్లు తెలిపారు. పీసీసీ అధ్యక్షుడు మారిన ప్రతిసారి కొత్త కమిటీలు ఏర్పడతాయని, కొత్త కమిటీల విషయంలో ఏఐసీసీ పెద్దలతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. కమిటీల ఏర్పాటులో వెనుకబడిన వర్గాలకు పెద్దపీట వేస్తామని చెప్పారు. ప్రభుత్వం, పార్టీ సమన్వయంతో ముందుకు సాగాల్సి ఉంటుందన్నారు. పార్టీ ఫిరాయించిన అంశంలో హైకోర్టు నిర్ణయాన్ని గౌరవిస్తూనే.. న్యాయప్రత్యామ్నాయాలు చూస్తామని తెలిపారు. తమ పార్టీ విధానాలు, పాలన చూసి కొందరు నేతలు వస్తే చేర్చుకున్నట్లు మహేష్‌కుమార్ గౌడ్ తెలిపారు. ప్రతిపక్ష పాత్ర నిర్వహించే స్థితిలో బీఆర్ఎస్ నేతలు లేరని, లోక్‌సభ ఎన్నికలలో ప్రజలు వారికి సున్నా స్థానాలు ఇచ్చారని ఆయన గుర్తు చేశారు. ఎమ్మెల్యేల ఫిరాయింపు అంశంలో ఉప ఎన్నికలు వస్తాయని తాను భావించడంలేదని, ఒక వేళ వచ్చినా ఆ స్థానాలు తమ ఖాతాలోనే పడతాయని మహేష్‌కుమార్ గౌడ్ ఆశాభావం వ్యక్తం చేశారు. అరికెపూడి గాంధీ సాంకేతికంగా బీఆర్ఎస్ సభ్యుడని, నిబంధనల మేరకే పీఏసీ ఛైర్మన్ అయ్యారని అన్నారు. మరోవైపు ఎయిమ్స్ ఆస్పత్రిలో సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి భౌతికకాయానికి మహేష్‌కుమార్ గౌడ్ నివాళులు అర్పించారు.



ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మహేష్‌కుమార్ గౌడ్, కుటుంబ సభ్యులు

విద్యుత్తు కొనుగోళ్లపై నిషేధం!

పవర్‌గ్రిడ్‌కు రూ.261 కోట్లు చెల్లించలేదని టీజీఎస్పీడీసీఎల్‌పై గ్రిడ్ కంట్రోలర్ ఆఫ్ ఇండియా చర్యలు

» ఛత్తీస్‌గఢ్ విద్యుత్తు కొనుగోలులో గత ప్రభుత్వ నిర్వాకంతోనే..

» హైకోర్టును ఆశ్రయించిన ఎస్పీడీసీఎల్

» పవర్‌గ్రిడ్ ఉత్తర్వులపై స్టే విధించిన కోర్టు



హైదరాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ దక్షిణ ప్రాంత విద్యుత్తు సంస్థ (టీజీఎస్పీడీసీఎల్)కు గత ప్రభుత్వ నిర్వాకంతో షాక్ తగిలింది. ముందుచూపు లేకుండా తీసుకున్న నిర్ణయం డిస్కమ్‌కు శాపంలా మారింది. ఛత్తీస్‌గఢ్ నుంచి 1000 మెగావాట్ల విద్యుత్తును తీసుకుంటామని కారిడార్ బుక్ చేసుకున్న తర్వాత, అవసరం లేదని పేర్కొన్న కేసులో రూ.261.31 కోట్లను ఎస్పీడీసీఎల్ చెల్లించడం లేదంటూ పవర్ గ్రిడ్ జాతీయ లోడ్ డిస్పాచ్ సెంటర్ (ఎన్ఎల్‌డీసీ)కు ఫిర్యాదు చేసింది. స్పందించిన ఎన్ఎల్‌డీసీ బహిరంగ విపణిలో ఎస్పీడీసీఎల్ విద్యుత్తు క్రయవిక్రయాలపై గురువారం ఉదయం నిషేధం విధించింది. గత ప్రభుత్వం ఛత్తీస్‌గఢ్‌లోని మార్వా ప్లాంట్ నుంచి 1000 మెగావాట్లు, అదనంగా మరో 1000 మెగావాట్ల కోసం పవర్‌గ్రిడ్‌తో ఒప్పందం చేసుకున్న విషయం తెలిసిందే. విద్యుత్తు చెల్లింపుల వివాదంతో మార్వా ప్లాంట్ నుంచి 1000 మెగావాట్ల కరెంట్ ఆగిపోగా.. అదనంగా తీసుకుంటామని చెప్పిన 1000మెగావాట్లపై బీఆర్ఎస్ సర్కారు వెనక్కి తగ్గింది. అయితే, తెలంగాణ ప్రభుత్వ విజ్ఞప్తితో లైన్లు వేసినప్పటికీ వినియోగించుకోకుండా వదిలేసినందున చార్జీల కింద రూ.261.31కోట్లు చెల్లించాలంటూ మార్చి 12న పవర్ గ్రిడ్ తెలంగాణ పవర్ కో-ఆర్డినేషన్ కమిటీకి బిల్లును పంపింది. దీనిపై కేంద్ర విద్యుత్తు నియంత్రణ మండలి (సీఈఆర్‌సీ)లో టీజీఎస్పీడీసీఎల్ పిటిషన్ వేసింది. ఈ కేసులో వాదనలు జరగాల్సి ఉండగా.. 'గ్రిడ్ కంట్రోలర్ ఆఫ్ ఇండియా'కు పవర్‌గ్రిడ్ ఫిర్యాదు చేసింది. దీంతో బహిరంగ విపణిలో కరెంట్ కొనుగోళ్లకు అవకాశం లేకుండా కట్టడి చేస్తూ బుధవారం ప్రాప్తి (పేమెంట్ రాటిఫికేషన్ ఇన్ పవర్ ప్రొక్యూర్‌మెంట్ ఫర్ బ్రింగింగ్ ట్రాన్స్‌పరెన్సీ ఇన్ ఇన్‌వాయిసింగ్ ఆఫ్ జనరేటర్స్) పోర్టల్ నోటిఫికేషన్ ఇచ్చింది. దీని ఆధారంగా గురువారం ఉదయం నుంచి కరెంట్ కొనుగోళ్లు నిలుపుదల చేసింది. విషయం తెలిసిన వెంటనే ఢిల్లీలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. రాష్ట్రంలో విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. వెంటనే హైకోర్టులో లంచ్‌మోషన్ పిటిషన్ వేయాలని ఆదేశించారు. సీఎం సూచనలతో అధికారులు కోర్టును ఆశ్రయించారు.

స్టే విధించిన హైకోర్టు

చార్జీల కేసు సీఈఆర్‌సీలో పెండింగ్‌లో ఉండగా కఠిన చర్యలు చేపట్టడం అక్రమమని, రాష్ట్ర ప్రజలకు విద్యుత్తు సరఫరా నిలిచిపోతుందని పేర్కొంటూ టీజీఎస్పీడీసీఎల్ హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ధర్మాసనం విచారణ చేపట్టింది. డిస్కం తరఫున అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. కమిషన్ వద్ద కేసు పెండింగ్‌లో ఉండగానే ప్రతివాదులు లేట్ పేమెంట్ సర్‌చార్జి నిబంధనల కింద పిటిషనర్‌ను డీఫాల్టర్ జాబితాలో పెట్టడం అక్రమమని తెలిపారు. పిటిషనర్ విద్యుత్తు కొనుగోళ్లలో పాల్గొనేలా అనుమతించాలని కోరారు. పవర్‌గ్రిడ్, కేంద్రం తరఫున అసిస్టెంట్ సొలిసిటర్ జనరల్ గాడి ప్రవీణ్ వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్‌కు నోటీసు ఇచ్చి ఆరు నెలలైనా స్పందించకపోవడం వల్లే చర్యలు తీసుకోవాల్సి వచ్చిందని చెప్పారు. ఇదే తరహా వివాదంలో 25శాతం చార్జీలు చెల్లిస్తే విద్యుత్తు కొనుగోళ్లకు అనుమతించాలని ఢిల్లీ హైకోర్టు ఇటీవల తీర్పు ఇచ్చిందని తెలిపారు. పిటిషనర్ కూడా రూ.261 కోట్లలో 25 శాతం చెల్లిస్తే పవర్ ట్రేడింగ్‌కు అనుమతిస్తామని చెప్పారు. వాదనలు విన్న ధర్మాసనం 'ఇది రాష్ట్రంలోని కోట్లాది మందికి విద్యుత్తు సరఫరాకు సంబంధించిన అంశం. సరఫరా నిలిచిపోతే ఇబ్బందులొస్తాయి. ఇతర వనరులు అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో తెలంగాణ సొంతంగా విద్యుదుత్పత్తి చేసుకోగలుగుతోంది. రాష్ట్రానికి కారిడార్ అవసరం లేకపోయి ఉండొచ్చు'అని పేర్కొంది. చార్జీల వివాదం సెంట్రల్‌కమిషన్ వద్ద పెండింగ్‌లో ఉండగా విద్యుత్తు కొనుగోళ్లు చేయకుండా పిటిషనర్‌ను అడ్డుకోవడం సరికాదని పేర్కొంది. ప్రాప్తి పోర్టల్ ద్వారా జారీచేసిన ఉత్తర్వులపై స్టే విధిస్తున్నట్లు ప్రకటించింది. పిటిషనర్‌ను విద్యుత్తు క్రయవిక్రయాల్లో పాల్గొనేందుకు అనుమతించాలని స్పష్టం చేసింది. తదుపరి ఉత్తర్వులిచ్చే వరకు ఆదేశాలు కొనసాగుతాయని పేర్కొంటూ విచారణను అక్టోబరు 17కు వాయిదా వేసింది. ఈ విషయాన్ని వెంటనే ప్రతివాదులకు తెలియజేయాలని ప్రవీణ్‌కుమార్‌ను ఆదేశించింది. ఈ అంశంపై వివరణ ఇవ్వాలంటూ గ్రిడ్ కంట్రోలర్ ఆఫ్ ఇండియా, పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్, సెంట్రల్ ట్రాన్స్‌మిషన్ యుటిలిటీ ఆఫ్ ఇండియా, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఇండియన్ ఎనర్జీ ఎక్స్ఛేంజ్, కేంద్ర విద్యుత్తు శాఖకు నోటీసులు జారీచేసింది.

బతకడానికి వచ్చినోళ్ల ఓట్లతోనే బీఆర్ఎస్‌కు సీట్లు

(మొదటిపేజీ తరువాయి)

వ్యాఖ్యానించారు. గురువారం ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో తెలుగు మీడియాతో రేవంత్ ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. బీఆర్ఎస్‌లో చిల్లరగాళ్లు, బ్రోకర్లు చేరినందుకే కేసీఆర్ దగ్గరికి వెళ్లేందుకు తనకు మనసు రావడం లేదని అరికెపూడి గాంధీ అంటున్నారని తెలిపారు. "ధర్నాలు చేయొద్దు. ఎక్కడి నుంచి వచ్చారు?" అని గతంలో కేసీఆర్ ఆంధ్రవారిని ఉద్దేశించి అన్న మాటలనే ఇప్పుడు కౌశిక్ రెడ్డి అంటున్నారని ధ్వజమెత్తారు. గాంధీకి పీఏసీ పదవి ఇవ్వడంలో తప్పేమీ లేదని.. గతంలో కూడా ఇతరులను పీఏసీలో నియమించిన సందర్భాలు ఉన్నాయని చెప్పారు. బీఆర్ఎస్‌కు తాము ఓనర్లమయినందున ఆ స్థానంలో తామే ఉండాలని హరీశ్ భావిస్తున్నారని ఆరోపించారు. 2018-23 మధ్య కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉంటే.. అక్బరుద్దీన్ ఒవైసీని పీఏసీ ఛైర్మన్‌గా ఎలా నియమించారని రేవంత్ ప్రశ్నించారు. 2014లో టీడీపీలో 15 మంది ఎమ్మెల్యేలున్నా బీఏసీకి ఎర్రబెల్లిని రానిచ్చారని, తనను అనుమతించలేదని.. ఎర్రబెల్లి పార్టీ మారినప్పుడు టీడీపీ ఫ్లోర్ లీడర్‌గా తనను నియమించాలంటూ చంద్రబాబు లేఖ ఇచ్చినా నాటి సభాపతి పట్టించుకోలేదని గుర్తుచేశారు. కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలపై స్పీకర్ నాలుగు వారాలలో నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు ఇచ్చిన తీర్పును తాను అధ్యయనం చేయలేదని చెప్పారు. ప్రభుత్వాన్ని పడగొడతామని బెదిరింపులు చేసినందుకే ఇటువంటి సమస్యలు వస్తున్నాయని.. అలా పడగొట్టే అవకాశం లేకపోతే తమకొచ్చే ప్రమాదం ఏమీ ఉండదని అన్నారు. ఏ పార్టీ వాళ్లు ఆ పార్టీలోనే ఉండాలని అంటే తనకొచ్చిన ఇబ్బందేమీ లేదని, కేసీఆర్ లక్కీ నెంబర్ అయిన 66మంది ఎమ్మెల్యేల బలం కాంగ్రెస్‌కు ఉందని చమత్కరించారు. బీఏసీలో అన్ని పార్టీలకూ తాము అవకాశం ఇచ్చామని, కాంగ్రెస్‌కు తరఫున నలుగురు ఉంటే బీఆర్ఎస్ నుంచి ఆరుగురిని, సీపీఐ, బీజేపీ, ఎంఐఎం నుంచి ఒక్కొక్కరిని చేర్చుకున్నామని చెప్పారు. కౌన్సిల్‌లో తమకు మెజారిటీ లేనందువల్ల బీఆర్ఎస్ నుంచి ముగ్గురిని తీసుకున్నామని, ఆ పార్టీకి తామేమీ లోటు చేయలేదన్నారు.



ఏపీ సీఎం చంద్రబాబుకు జ్ఞాపికను అందజేస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దంపతులు

చంద్రబాబును అభినందించిన ఉత్తమ్

వెలగపూడి సచివాలయంలో బాబుతో భేటీ

అమరావతి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నాలుగోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన సీఎం చంద్రబాబు నాయుడును తెలంగాణ జల వనరుల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్ రెడ్డి అభినందించారు. తన మిత్రుడి ఇంట జరిగిన ఓ కార్యక్రమానికి హాజరయ్యేందుకు గురువారం విజయవాడకు వచ్చిన ఉత్తమ్‌కుమార్ రెడ్డి దంపతులు వెలగపూడి సచివాలయంలో సీఎం చంద్రబాబుతో భేటీ అయ్యారు. బాబుకు అభినందనలు తెలిపారు. ముఖ్యమంత్రిగా నాలుగోసారి బాధ్యతలు స్వీకరించడం పట్ల సంతోషంగా ఉందని ముఖ్యమంత్రితో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. కాగా.. ఇరువురి మధ్య స్నేహపూర్వక పరస్పర అభినందనలు మినహా.. రాష్ట్రాల అంశాలు ప్రస్తావనకు రాలేదని ఉత్తమ్‌కుమార్ రెడ్డి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

మంత్రివర్గ విస్తరణపై వచ్చే వారమే చర్చలు?

న్యూఢిల్లీ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మంత్రివర్గ విస్తరణపై కాంగ్రెస్ అధిష్ఠానంతో సీఎం రేవంత్‌రెడ్డి చర్చలు వచ్చే వారమే జరిగే అవకాశాలున్నాయి. రేవంత్ వచ్చే సోమవారం (16న) మరోసారి ఢిల్లీకి రానున్న సంగతి తెలిసిందే. అయితే.. పార్టీ సంస్థాగత ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో గురువారం ఆయన నివాసంలో భేటీ అయిన రేవంత్ రెడ్డి దీనిపై ప్రాథమిక చర్చలు జరిపినట్లు సమాచారం. అంతకుముందు మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడిన సమయంలో మంత్రివర్గ విస్తరణపై సీఎంను ప్రశ్నించగా.. పీసీసీ అధ్యక్షుడే దానికి సమాధానం చెబుతారని ఆయన పేర్కొన్నారు. మంత్రివర్గాన్ని విస్తరించాలని పార్టీ అధ్యక్షుడిగా ఆయన నిర్ణయిస్తే.. ఎవరెవరిని తీసుకోవాలో తాను నిర్ణయిస్తానని చెప్పారు. మీడియాతో చిట్‌చాట్ అనంతరం రేవంత్ హైదరాబాద్‌కు తిరుగుపయనమయ్యారు.

'స్థానికత'పై సుప్రీం కోర్టుకు సర్కారు

» త్వరగా విచారించాలన్న విజ్ఞప్తికి ధర్మాసనం ఓకే

» హైకోర్టు తీర్పుతో రాష్ట్రంలో ఆగిన వైద్య విద్య ప్రవేశాలు

» సర్కారుకు అనుకూలంగా తీర్పు వస్తే వేగంగా అడ్మిషన్లు

» లేదంటే మళ్లీ మార్గదర్శకాలు ఇవ్వాల్సిందే



న్యూఢిల్లీ/హైదరాబాద్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): వైద్య విద్య ప్రవేశాల్లో స్థానికత వ్యవహారంపై తెలంగాణ ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించింది. వైద్య విద్యలో అడ్మిషన్లు పొందడానికి తొమ్మిది, పది తరగతులతోపాటు ఇంటర్మీడియట్ విద్యను తెలంగాణలో పూర్తి చేసిన వారికే స్థానిక రిజర్వేషన్ వర్తింపజేస్తామంటూ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 33పై పలువురు హైకోర్టును ఆశ్రయించగా.. కోర్టు సైతం అభ్యంతరం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలో వరుసగా నాలుగేళ్లు చదువుకోలేదన్న కారణంతో శాశ్వత నివాసులకు ఎంబీబీఎస్, బీడీఎస్ అడ్మిషన్ నిరాకరించకూడదని సదరు ఆదేశాల్లో పేర్కొంది. దీన్ని సవాల్ చేస్తూ తాజాగా రాష్ట్ర ప్రభుత్వం గురువారం సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌ను వెంటనే విచారణకు స్వీకరించాలని ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనాన్ని తెలంగాణ తరఫు న్యాయవాదులు కోరగా.. ధర్మాసనం అంగీకరించింది. అయితే, వైద్య విద్య ప్రవేశాలపై సందిగ్ధం నెలకొన్న వేళ.. సుప్రీం కోర్టు ఏం తీర్పు వెలువరిస్తుందన్న అంశంపై ఉత్కంఠ నెలకొంది. ఒక వేళ హైకోర్టు తీర్పుపై సుప్రీం కోర్టు స్టే ఇస్తే.. వెంటనే ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఒక వేళ హైకోర్టు తీర్పును సమర్థిస్తే మాత్రం కౌన్సెలింగ్ ప్రక్రియ మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉందని వైద్య శాఖ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. గతంలో సుప్రీం కోర్టు జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం అక్టోబరు 1 నుంచే వైద్య విద్య తరగతులు ప్రారంభం కావాలి. అక్టోబరు 30లోగా వైద్య విద్య ప్రవేశాల ప్రక్రియ పూర్తి చేయాలి. ఆ తర్వాత ఎలాంటి ప్రవేశాలు చేపట్టకూడదు. అందుకు మరో 47 రోజులే గడువు ఉండగా.. రాష్ట్రంలో ఇప్పటిదాకా ప్రవేశాల ప్రక్రియే ప్రారంభం కాకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఇదే విషయమై వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ బుధవారం వైద్య, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో వైద్య విద్య ప్రవేశాలపై సమీక్ష నిర్వహించారు. కౌన్సెలింగ్ పూర్తి కావడానికి ఎన్ని రోజుల సమయం పడుతుందంటూ ఆరా తీశారు. ఒక వేళ సుప్రీంకోర్టులో అనుకూల తీర్పు రాకుంటే తక్షణమే స్థానికతపై మార్గదర్శకాలు రూపొందించాల్సి ఉంటుందని, ఆ ప్రకారం రెసిడెన్స్ సర్టిఫికెట్ల జారీకి సమయం పడుతుందని అధికారులు మంత్రికి వివరించారు.

4 రౌండ్లు... ఒక్కో దానికి 10 రోజులు

ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయుష్ కోర్సుల్లో ప్రవేశాల కౌన్సెలింగ్‌ను నాలుగు విడతల్లో నిర్వహిస్తారు. కన్వీనర్, యాజమాన్య, ఎన్ఆర్ఐ కోటా సీట్ల భర్తీ తర్వాత, విద్యార్థులు చేరకుండా మిగిలిపోయిన సీట్లకు చివరిగా స్ట్రే వేకెన్సీ రౌండ్ ద్వారా భర్తీ చేస్తారు. ఒక్కో రౌండ్‌కు కనీసం పది రోజుల సమయం పడుతుంది. ఈ ఏడాది ఎంబీబీఎస్‌లో కన్వీనర్ కోటా సీట్ల కోసం 17,654 మంది, యాజమాన్య, ఎన్ఆర్ఐ కేటగిరీల కింద మరో 6,468 మంది దరఖాస్తు చేసుకున్నారు. వెరసి మొత్తం 24,122 మంది తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. అడ్మిషన్ల ప్రక్రియ అంతా అక్టోబరు 30లోగానే పూర్తి చేయాలి. సుప్రీం కోర్టు మార్గదర్శకాల ప్రకారం ఆలోగా ప్రక్రియ పూర్తి చేయకుంటే మిగిలిపోయిన సీట్లను అలా వదిలేయాల్సిందే. ఈ నేపథ్యంలో అటు వైద్యశాఖలోనూ, ఇటు విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లోనూ తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. వాస్తవానికి గత నెల 3వ తేదీ నుంచే దేశ వ్యాప్తంగా ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైంది. ఆలిండియా కోటా సీట్లకు ఆగస్టు రెండో వారంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇప్పటికే దాదాపు అన్ని రాష్ట్రాల్లోనూ మొదటి విడత కౌన్సెలింగ్ పూర్తయింది. సుప్రీం కోర్టులో రాష్ట్ర ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పువచ్చినా..సమయం సరిపోకపోవచ్చన్న అభిప్రాయాలున్నాయి.ఈ నేపథ్యంలో ఒక వేళ రాష్ట్రంలో సీటు రాని విద్యార్థులు.. పొరుగు రాష్ట్రాల్లోని కాలేజీల్లో చేరే అవకాశం కోల్పోనున్నారు.

కేంద్ర సెస్సులు, సర్‌చార్జీలను నిరోధించాలి

లేదంటే వాటిలోనూ రాష్ట్రాలకు వాటా ఇవ్వాలి.. పన్నుల వాటాను 41 నుంచి 50 శాతానికి పెంచాలి

» బీజేపీయేతర రాష్ట్రాల మంత్రుల భేటీలో డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం వసూలు చేస్తున్న సెస్‌లు, సర్‌చార్జీల వల్ల రాష్ట్రాల పన్నుల వాటా నిధుల్లో కోత పడుతోందని రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి సెస్‌లు, సర్‌చార్జీలను నిరోధించాలని లేదంటే వాటిలోనూ రాష్ట్రాలకు వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. దేశంలోని ఐదు బీజేపీయేతర రాష్ట్రాలైన తెలంగాణ, కేరళ, కర్ణాటక, తమిళనాడు, పంజాబ్ ఆర్థిక మంత్రుల సమావేశం గురువారం కేరళలోని తిరువనంతపురంలో జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న భట్టివిక్రమార్క.. పన్నుల వాటా విషయంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని తప్పుపట్టారు. కేంద్ర పన్నుల్లో రాష్ట్రాలకు ఇచ్చే నిధులను 14వ ఆర్థిక సంఘం 32 నుంచి 42 శాతానికి పెంచిందని, 15వ ఆర్థిక సంఘం దాన్ని 41 శాతానికి కుదించిందని తెలిపారు. ఈ 41 శాతం నిధులు కూడా రాష్ట్రాలకు రావడం లేదని, కేవలం 31 శాతం నిధులు మాత్రమే అందుతున్నాయని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం సెస్‌లు, సర్‌చార్జీలను వసూలు చేస్తుండడంతో పన్నుల వాటా తగ్గుతుందని అన్నారు. వీటిని కూడా రాష్ట్రాలకు పంచాలని అడుగుతుంటే కేంద్రం పట్టించుకోవడం లేదన్నారు. దక్షిణాది రాష్ట్రాలు కేంద్ర జీడీపీకి 30 శాతం భాగస్వామ్యాన్ని అందిస్తున్నాయని, దేశ జనాభాలో 19.6 శాతం జనాభా ఈ రాష్ట్రాల్లోనే ఉందని తెలిపారు. కానీ, ఈ రాష్ట్రాలకు పన్నుల్లో వాటా నిధులు 21.07 శాతం నుంచి 15.80 శాతానికి తగ్గిపోయాయని చెప్పారు. వస్తు సేవల పన్ను (జీఎస్టీ) కింద రాష్ట్రాలకు ఇవ్వాల్సిన పరిహారాన్ని సకాలంలో ఇవ్వడం లేదని, పర్యవసానంగా రాష్ట్రాలు ఆర్థిక ప్రణాళికను రూపొందించుకోవడంలో ఇబ్బంది పడాల్సి వస్తోందని అన్నారు. కేంద్ర ప్రాయోజిత పథకాల(సీఎస్ఎస్)లో కఠినమైన నిబంధనలున్నాయని, వాటికి రాష్ట్రాలు మ్యాచింగ్ గ్రాంట్‌ను విడుదల చేయాల్సి వస్తుండడంతో ఆర్థిక భారం పడుతుందని చెప్పారు. ఇలా సీఎస్ఎస్‌ల కోసం రాష్ట్ర సొంత వనరులను మళ్లించాల్సి వస్తుండడంతో ఇతర ముఖ్యమైన రాష్ట్ర పథకాలకు నిధుల కొరత ఏర్పడుతుందన్నారు. రాష్ట్రాలకు నికరంగా వచ్చే పన్నుల వాటా నిధులను తగ్గిస్తూ.. మరోవైపు రాష్ట్రాలకు సరిగా ఉపయోగపడని సీఎస్ఎస్‌లకు కేంద్ర ప్రభుత్వం నిధులను పెంచుతోందని ఆరోపించారు. ఇప్పటికే దేశ ద్రవ్య లోటు జీడీపీలో 5.6 శాతానికి పెరిగిందన్నారు. ద్రవ్య బాధ్యతను పాటిస్తున్న రాష్ట్రాలకు ఒక నీతి, ద్రవ్యలోటు పెరుగుతున్నా యథేచ్ఛగా రుణాలు తీసుకునే కేంద్రానికి మరో నీతా అని ప్రశ్నించారు.



ఇవీ రాష్ట్ర డిమాండ్లు..

- కేంద్ర ప్రభుత్వ సెస్సులు, సర్‌చార్జీలను నిరోధించాలి.
- కేంద్ర పన్నుల్లో వాటాను 41 నుంచి 50 శాతానికి పెంచాలి.
- ద్రవ్య బాధ్యత పాటించే రాష్ట్రాలు ఎక్కువ రుణాలు తీసుకునేలా స్వయంప్రతిపత్తిని కల్పించాలి.
- డీలిమిటేషన్ ప్రక్రియలో దక్షిణాది రాష్ట్రాలకు లోక్‌సభ సీట్లు పెరిగేలా చూడాలి.
- కేంద్రప్రాయోజిత పథకాలను రాష్ట్రాలు తమ అవసరాలకు తగ్గట్టు వినియోగించుకునే అవకాశమివ్వాలి.

ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ ప్రకటించాలి



సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

రామగిరి, సెప్టెంబరు 12: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు ఇవ్వాల్సిన అలవెన్స్ వెంటనే ఇవ్వాలని టీఎస్ యుటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ల వెంకటేశం డిమాండ్ చేశారు. పట్టణంలోని సంఘం భవనంలో గురువారం నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం రెండో పీఆర్‌సీ కమిటీ నివేదికపై ఉద్యోగుల సంఘాలతో చర్చ జరిపి ఫిట్‌మెంట్‌తో అమలు చేయాలని అన్నారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులన్నింటినీ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జీపీఎఫ్, టీఎస్‌జీఎల్‌ఐ వంటి బిల్లులను మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నాగిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, నరేష్, ఎండీ.అమ్జద్, సంధ్యారాణి, వెంకట్‌రెడ్డి, యలాద్రి, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీల్లో సత్తా చాటాలి




జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

నల్లగొండ స్పోర్ట్స్, సెప్టెంబరు 12: జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో సత్తా చాటాలని నల్లగొండ జిల్లా తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి ఎండీ యూనుస్ కమాల్ అన్నారు. తమిళనాడు రాష్ట్రం దుండిగల్ లగ్జరీ వరల్డ్ స్కూల్ మైదానంలో ఈ నెల 14వ తేదీ వరకు జరగనున్న ఖేలో ఇండియా ఫ్రేస్-2 తైక్వాండో ఛాంపియన్‌షిప్ పోటీలకు సఫియా, అక్షయ, రేష్మ, శ్రేష్ఠచంద్ర క్రీడాకారులు ఎంపికయ్యారు. గురువారం జాతీయ పోటీలకు బయలుదేరిన సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 5వ తేదీన హైదరాబాద్ కూకట్‌పల్లి క్రీడా మైదానంలో తెలంగాణ రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి ఖేలో ఇండియా పోటీల్లో వివిధ కేటగిరి విభాగాల్లో నల్లగొండకు చెందిన ఐదుగురు బాలికలు ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు. వారిలో నలుగురు బాలికలు జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించారని పేర్కొన్నారు. జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు అర్హత సాధించడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో కోచ్, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

ఆగిన లారీని ఢీకొట్టి యువకుడి మృతి

దామరచర్ల, సెప్టెంబరు 12: ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనం అదుపు తప్పి యువకుడు మృతి చెందాడు. ఈ ప్రమాదం దామరచర్ల మండల కేంద్రంలో గురువారం జరిగింది. వాడపల్లి ఎస్‌ఐ ఇరుగు రవి తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని వాడపల్లి గ్రామానికి చెందిన చల్లా రవిశంకర్ (35) కూలీ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో పని నిమిత్తం ద్విచక్రవాహనంపై దామరచర్లకు వచ్చి తిరిగి వాడపల్లికి వెళ్తున్నాడు. గ్రామ శివారులోని నార్కట్‌పల్లి- అద్దంకి రహదారి మూలమలుపు వద్ద మరమ్మతు నిమిత్తం రోడ్డు పక్కన నిలిపి ఉంచిన లారీని ప్రమాదవశాత్తు వెనుక నుంచి ఢీకొట్టాడు. దీంతో రవిశంకర్ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు రవిశంకర్‌కు ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుని భార్య మౌనిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

దొంగ అరెస్ట్... సొమ్ము స్వాధీనం



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ రాజశేఖర్‌రాజు

హాలియా, సెప్టెంబరు 12: రెండు నెలల క్రితం ఓ ఇంట్లో జరిగిన చోరీ కేసులో నిందితుడిని నిడమనూరు పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం హాలియా పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు వివరాలను తెలియజేశారు. నిడమనూరు మండలం ముకుందాపురం గ్రామానికి చెందిన షేక్ ఉస్మాన్ అతని కుటుంబ సభ్యులతో కలిసి సెప్టెంబరు 17వ తేదీన రుద్రారం గ్రామంలో జరిగే పీర్ల పండుగకు వెళ్లారు. అదే గ్రామానికి చెందిన షేక్ అబ్దుల్ నబీ రోజువారీగా గృహ నిర్మాణ పనులకు వెళ్లేవాడు. అతను తాగుడు, చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. అతని జల్సాలకు డబ్బులు సరిపోకపోవడంతో చోరీకి పాల్పడ్డాడు. ఉస్మాన్ కుటుంబసభ్యులు ఊరికి వెళ్లిన విషయం తెలుసుకొని అదే రోజు రాత్రి ఇంటి తలుపులు పగులగొట్టి ఇంటిలో ఉన్న రూ.73వేల నగదు, 12 తులాల బంగారు ఆభరణాలు, 15 తులాల వెండి కాళ్ల పట్టీలను చోరీ చేశాడు. అనంతరం ఎవరికీ అనుమానం రాకుండా నబీ ద్విచక్రవాహనంపై రుద్రారం గ్రామంలో జరిగే పీర్ల పండుగలో పాల్గొన్నాడు. అనంతరం నబీ అక్కడి నుంచి హైదరాబాద్‌కు పారిపోయాడు. బాధితుడు ఉస్మాన్ ఫిర్యాదు మేరకు నిడమనూరు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేశారు. నల్లగొండ సీసీఎస్ సీఐ జితేందర్‌రెడ్డి, నిడమనూరు పోలీసులు కలిసి దర్యాప్తు చేసి అతడిని అరెస్ట్ చేశారు. అతని వద్ద ఉన్న బంగారంలో రెండు తులాల బంగారు ఆభరణాలు విక్రయించగా, మిగిలిన 10 తులాల బంగారం, 15 తులాల వెండి పట్టీలు, ద్విచక్రవాహనం, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. గురువారం నిడమనూరు కోర్టులో రిమాండ్ చేశారు. కేసును ఛేదించిన హాలియా సీఐ జనార్దన్, ఎస్‌ఐ గోపాలరావు, నల్లగొండ సీసీఎస్ సీఐ జితేందర్‌రెడ్డి, సిబ్బంది విష్ణువర్ధన్, గిరి, పుష్పగిరి, వాహిద్‌పాషా, ఇమ్రాన్, శ్రావణ్, శేఖర్‌లను ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో సీఐలు జనార్ధన్, జితేందర్‌రెడ్డి, ఎస్‌ఐలు సతీష్‌రెడ్డి, గోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

డీసీఎం డ్రైవర్ పై కేసు నమోదు

తిప్పర్తి, సెప్టెంబరు 12: రోడ్డు ప్రమాదానికి కారణమైన డీసీఎం వాహనంతో పాటు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ లింగయ్య తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తిప్పర్తి మండల కేంద్రానికి చెందిన జక్కలి మహేష్ (21) అనే యువకుడు గత నెల 28వ తేదీన నల్లగొండ నుంచి తిప్పర్తికి తన ద్విచక్రవాహనంపై వస్తున్నాడు. అనిశెట్టి దుప్పలపల్లి గ్రామ సమీపంలో వెనుక నుంచి వచ్చిన టీఎస్ 30టీ 2638 అనే నెంబరు గల డీసీఎం బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో జక్కలి మహేష్ తీవ్రంగా గాయపడ్డాడు. తలకు, నోటి దవడకు పెద్ద గాయమవడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. యువకుడి తండ్రి జక్కలి నాగయ్య గురువారం చేసిన ఫిర్యాదు మేరకు డీసీఎం డ్రైవర్ నవీన్‌కుమార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ లింగయ్య తెలిపారు.

కొనసాగుతున్న గణేష్ నవరాత్రి ఉత్సవాలు

- పలుచోట్ల వైభవంగా శోభాయాత్ర
- వినాయక మండపాల వద్ద అన్నదానం



నల్లగొండలో వల్లభరావు చెరువు వద్ద నిమజ్జనాలను పరిశీలిస్తున్న నగర గణేష్ ఉత్సవ సమితి

నల్లగొండ కల్చరల్, సెప్టెంబరు 12: గణేష్ నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. గురువారం ఐదో రోజు నల్లగొండ పట్టణంలోని పలు మండపాల్లో గణనాథులకు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి గణేష్ నిమజ్జన శోభాయాత్రను వైభవంగా నిర్వహించారు. పాతబస్తీ, సావర్కర్‌నగర్, ఎల్‌పీటీ మార్కెట్, బోయవాడ, మాన్యంచెల్క తదితర ప్రాంతాలలోని వి నాయక మండపాల్లో వినాయకులను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఆశీనులను చేసి నిమజ్జనానికి తరలించారు. అడుగడునా భక్తులు నీరాజనాలు పలికారు. అదేవిధంగా పలు మండపాల్లో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్జాలబావి దగ్గర గల వల్లభరావు బతుకమ్మ కుంటలో 5 ఫీట్లు ఉన్న విగ్రహాల ను నిమజ్జనాన్ని చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. 5ఫీట్లు పైబడిన విగ్రహాలను 14వ మైలురాయి వద్ద నిమజ్జనం చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. నగర గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో అధ్యక్షుడు విజయ్‌కుమార్, కార్యదర్శి కట్ట సంపత్‌కుమార్ మండపాలను సందర్శించి ప్రశాంతంగా ఊరేగింపు నిర్వహించుకోవాలని కోరారు.

చండూరురూరల్: చండూరు మండలంలోని కొండాపురం గ్రామంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బరిగెల ఉమాశ్రీనివాస్, గడ్డం నవీన్, గడ్డం సందీప్, ఇరిగి రాజు, సైదులు, గడ్డం లక్ష్మయ్య, బిక్షమయ్య, శివ, పవన్ పాల్గొన్నారు.

చింతపల్లి: వేంకటేశ్వరనగర్ పద్మావతి ఆస్పత్రి చైర్మన్ రాజవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో వినాయక శోభాయాత్రను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణనాథునికి ప్రత్యేక పూజలు చేసి ఊరేగించారు.

వేములపల్లి: గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని మొల్కపట్నం గ్రామంలో మాజీ జడ్పీటీసీ మాలి పురుషోత్తంరెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు మాలి హరీష్‌రెడ్డి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మేరెడ్డి పృథ్వీరెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, కరుణాకర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, అంజిరెడ్డి పాల్గొన్నారు.

మిర్యాలగూడ టౌన్: పట్టణంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. గణేష్ మార్కెట్, సీతారాంపురం, డాక్టర్స్ కాలనీల్లో నిర్వహించిన పూజలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. పలు కాలనీల్లో అన్నదానం, నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించారు.

కట్టంగూరు: మండలకేంద్రంలో ట్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ఎస్‌ఐ ఎన్.శ్రీను ప్రారంభించారు. అనంతరం వినాయకుని వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో యువజన నాయకులు ముక్కమాల శేఖర్, ఎరుకల లక్ష్మణ్, పెద్ది శివ, మాదగోని సురేందర్, కాపుగంటి గోపి తదితరులు పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి: నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని సన్‌షైన్ కాలనీలో ఏర్పాటు చేసిన వినాయన మండపం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో శివకుమార్, అంజయ్య, రాము పాల్గొన్నారు.

కేతేపల్లి: మండలంలోని కేతేపల్లి, భీమారం, ఉప్పలపహాడ్ తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాల్లో ఎమ్మెల్యే వేముల వీరేశం, కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ పండగలు పండుగ వాతావరణంలో ఆనందోత్సాహాలతో నిర్వహించుకోవాలని సూచించారు. గణేష్ నిమజ్జనాన్ని భక్తిశ్రద్ధలతో శాంతియుతంగా నిర్వహించుకోవాలని ఆయన సూచించారు.



చండూరులో పూజలు చేస్తున్న భక్తులు



వల్లభరావు చెరువలో నిమజ్జనం చేస్తున్న సిబ్బంది



కేతేపల్లి: మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల వీరేశం



నల్లగొండలో వినాయక విగ్రహాన్ని నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు

అలుపెరుగని పోరాట యోధుడు సీతారాం



మిర్యాలగూడలో ఏచూరి చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నల్లగొండ రూరల్, మిర్యాలగూడ, చిట్యాల, సెప్టెంబరు 12: సీపీఎం అఖిల భారత కార్యదర్శి సీతారాం ఏచూరి అలుపెరుగని పోరాటయోధుడని పలువురు సీపీఎం నాయకులు కొనియాడారు. సీతారాం మృతి ప్రజాస్వామికశక్తులకు తీవ్ర దిగ్భ్రాంతి కలుగజేసిందని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి అన్నారు. జిల్లాలోని సీపీఎం కార్యాలయాల్లో గురువారం సీతారాం ఏచూరి మృతి పట్ల సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. రాజ్యసభ సభ్యుడిగా పలు స్టాండింగ్ కమిటీలకు సభ్యులుగా ఉన్నారు. కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న మతోన్మాద విధానాలు, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ, రాజ్యాంగ పరిరక్షణ, లౌకిక విలువలను కాపాడాలని కోరుతూ ప్రతిపక్ష పార్టీలతో ఇండియా కూటమి ఏర్పాటులో కీలకపాత్ర పోషించారు. సీతారాం ఏచూరీ మృతి కార్మికవర్గానికి, లౌకికవాదులకు, ప్రజాస్వామ్యవాదులకు, ప్రజాఉద్యమానికి తీవ్ర లోటని విచారం వ్యక్తం చేశారు.

● నల్లగొండ పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పార్టీ జిల్లా కార్యదర్శి సుధాకర్‌రెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన పోరాట పటిమను కొనియాడారు. సంతాపసభలో సీపీఎం జిల్లా నాయకులు తుమ్మల వీరారెడ్డి, నారి అయిలయ్య, బండ శ్రీశైలం, చిన్నపాక లక్ష్మీనారాయణ, పాలడుగు ప్రభావతి, సలీం, నర్సిరెడ్డి, గంజి మురళీధర్, సత్తయ్య, పద్మ, సైదులు, శంకరయ్య, పరిపూర్ణచారి పాల్గొన్నారు.

● మిర్యాలగూడలో నిర్వహించిన కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బీకార్ మల్లేష్, నాయకులు జగదీష్ చంద్ర, సత్యనారాయణరావు, వీరేపల్లి వెంకటేశ్వర్లు, మల్లు గౌతం రెడ్డి, భవాండ్ల పాండు, పరశురాములు, మంగారెడ్డి, శశిధర్‌రెడ్డి, పద్మ, రాంమూర్తి, ఆయూబ్, అంజద్ పాల్గొన్నారు.

● చిట్యాలలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య సీతారాం ఏచూరి చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ఎండీ అక్బర్, బొల్గూరి లింగయ్య, గుండాల సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్హత గల రైతులందరికీ రుణమాఫీ వర్తిస్తుంది



రైతుల నుంచి పత్రాలు స్వీకరిస్తున్న ఏడీఏ దేవ్‌సింగ్

మిర్యాలగూడ రూరల్, సెప్టెంబరు 12: అర్హత కలిగి సాంకేతిక కారణంగా రుణమాఫీ కాని రైతులందరికీ తప్పులను సరిచేసి రుణమాఫీ వర్తింపచేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఏడీఏ దేవ్‌సింగ్ అన్నారు. మిర్యాలగూడ మండలంలోని రాయినిపాలెం, జాలుబావితండా గ్రామాల్లో గురువారం రుణమాఫీకి సంబంధించి రైతుల కుటుంబసభ్యుల నిర్ధారణ సర్వేను ఆయన పరిశీలించి రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్దేశించిన తేదీల ప్రకారం ఆయా గ్రామాలకు వచ్చే వ్యవసాయాధికారులకు రుణమాఫీ కాని రైతులు అందుబాటులో ఉండి తమ పత్రాను అందించాలన్నారు. అదేవిధంగా పంటలకు సోకిన చీడపీడల నివారణకు అధికారులు అందించే సూచనలను పాటించాలన్నారు. కార్యక్రమంలో ఏవో సైదానాయక్, ఏఈవో అఫ్రీన్ తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి: అర్హులైన రైతులకు రుణమాఫీ పథకం వర్తిస్తుందని ఏవో శ్రావణకుమారి అన్నారు. మండలంలోని తక్కళ్లపల్లి గ్రామంలో రుణమాఫీ కాని రైతుల వివరాలు సేకరించారు. ఈ మేరకు ఖాతాతో పాటు, ఆధార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకం జీరాక్స్ పత్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గుండ్లపల్లి అనిత నరసింహారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

టూర్ గైడ్ల శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

నాగార్జునసాగర్, సెప్టెంబరు 12: నాగార్జునసాగర్ హిల్ కాలనీలో ఉన్న బుద్ధవనంలో అక్టోబరు నెలలో జరిగే టూర్ గైడ్ల శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తుననట్లు బుద్ధవనం ప్రత్యేక అధికారి, పర్యాటక అభివృ ద్ధి సంస్థ ఎండీ ఎస్.ప్రకాష్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబరు నెలలో పర్యాటకరంగ నిపుణులతో బుద్ధవనంలో వారం రోజుల పాటు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. శిక్షణ సమయంలో మధ్యాహ్న భోజన వసతి కల్పించనున్నట్లు పేర్కొన్నారు. స్థానిక విశ్రాంత ఉద్యోగులు ఆసక్తి గల నిరుద్యోగ యువతీ, యువకులు ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొనవచ్చని తెలిపారు. దరఖాస్తులు ఈ నెల 15వ తేదీలోపు బుద్ధవనంలో సమర్పించాలని ఆయన కోరారు. పూర్తి వివరాలకు బుద్ధవనం ప్రతినిధి శ్యాంసుందర్ నంబరు 9010051177ను సంప్రదించాలన్నారు.

ఇండియా పేమెంట్స్ కరస్పాండెట్ల కోసం...

వేములపల్లి, సెప్టెంబరు 12: వేములపల్లి, మిర్యాలగూడ, మాడ్గులపల్లి మండలాల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంకు సేవలు అందించేందుకు బిజినెస్ కరస్పాండెంట్ల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు రిలేషన్‌షిప్ అధికారి సందీప్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై ఉండటంతో పాటు మొబైల్ ఆన్‌లైన్ సేవలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. 18 సంవత్సరాల వయస్సు పైబడిన వారు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. వివరాల కోసం ఫోన్ నెం. 8464814641 నెంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

ఆర్టీసీ లాజిస్టిక్స్ సేవలను వినియోగించుకోవాలి

రామగిరి, సెప్టెంబరు 12: టీఎస్‌ఆర్టీసీ అందిస్తున్న లాజిస్టిక్ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని రీజనల్ ఏటీఎం సి.రవీందర్ అన్నారు. పట్టణంలోని ప్రకాశంబజార్‌లో గురువారం నిర్వహించిన మాస్ మార్కెటింగ్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అతి తక్కువ ఖర్చుతో తక్కువ సమయంలో వస్తువులు గమ్య స్థలానికి ఆర్టీసీ చేరవేస్తుందని అన్నారు. కార్యక్రమంలో లాజిస్టిక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వల్లాలలో అమరవీరుల స్థూప నిర్మాణం : వీహెచ్



విద్యార్థి అమరవీరులకు నివాళులర్పిస్తున్న హనుమంతరావు

శాలిగౌరారం, సెప్టెంబరు 12: మండలంలోని వల్లాల గ్రామంలో విద్యార్థి అమరవీరుల స్థూపాన్ని నిర్మించనున్నట్లు రాజ్యసభ మాజీ సభ్యుడు వి.హనుమంతరావు తెలిపారు. మండలంలోని వల్లాల గ్రామాన్ని ఆయన వల్లాల సందర్శించారు. విద్యార్థులు అమరులైన పాఠశాల స్థలంలో పూలు జల్లి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 17వ తేదీన గ్రామంలో విద్యార్థి అమరవీరుల స్థూప నిర్మాణానికి రాష్ట్ర మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే సామేల్ శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. 1947లో దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పుడు ఈ గ్రామానికి చెందిన 10మంది విద్యార్థులు జాతీయ జెండా ఎగురవేశారని, ఆగ్రహించిన నిజాం సర్కార్, రజాకార్ల గూండాలు వారిని చెట్లకు కట్టేసి కాల్చి చంపారని గుర్తుచేశారు. తమ ప్రాణాల్ని త్యాగం చేసిన వారిని గౌరవించాలని పేర్కొన్నారు. రెండేళ్లుగా తాను ఇక్కడికి వచ్చి నివాళులర్పిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు అన్నెబోయిన సుధాకర్, నాయకులు ఇంతియాజ్ అహ్మద్, గూని వెంకటయ్య, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు సాగర్‌కు హార్ట్‌ఫుల్ నెస్ మార్గదర్శకుడు దాజీ రాక

నాగార్జునసాగర్, సెప్టెంబరు 12: ప్రపంచ పర్యటనలో భాగంగా శ్రీ రామచంద్ర మిషన్ హార్ట్ ఫుల్‌నెస్ మార్గదర్శకుడు దాజీ శుక్రవారం ఉదయం 11 గంటలకు సాగర్ పైలాన్ కాలనీకి రానున్నట్లు ఆ సంస్థ నిర్వాహకులు గురువారం తెలిపారు. ప్రపంచంలో 160 దేశాల్లో 5 వేలకుపైగా ఆధ్యాత్మిక కేంద్రాలున్న హార్ట్ ఫుల్‌నెస్ మార్గదర్శి దాజీ ప్రపంచ మానవాళి శ్రేయస్సు కోసం వివిధ దేశాల్లో పర్యటనలు చేస్తున్నట్లు వారు తెలిపారు. శుక్రవారం సాగర్‌లో ఆయన మానవాళి ఎదుర్కొంటున్న భావోద్వేగ రుగ్మతలపై అవగాహన కల్పించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమాన్ని సాగర్ టీం సభ్యులు సత్యేంద్రప్రకాష్ నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

బెల్ట్‌షాపు మూసివేసిన వారికి సన్మానం

మునుగోడు రూరల్, సెప్టెంబరు 12: మద్యం విక్రయించకూడదని గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో సింగారం గ్రామంలో గురువారం చౌరస్తాలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్వచ్ఛందంగా బెల్ట్ షాపులను మూసివేసిన నలుగురిని శాలువాలతో సన్మానించారు. మునుగోడు ఎమ్మెల్యే ఆదేశాల మేరకు గ్రామంలో నూరుశాతం మద్యం విక్రయాలను నిషేధించి అందరికీ ఆదర్శంగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పొలగాని సత్యం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాల్వాయి చెన్నారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భీమనపల్లి సైదులు, నాయకులు కుంభం చెన్నారెడ్డి, కోడి చంద్రయ్య, పోగుల జానకీప్రకాష్, లక్ష్మమ్మ, వెంకటేష్, రమేష్, మిర్యాల వెంకన్న, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రయాణికుల కోసం ప్రత్యేక స్టాప్‌లు

రామగిరి, సెప్టెంబరు 12: ఆర్టీసీ ప్రయాణికుల కోసం ప్రత్యేక స్టాప్‌లను ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ ఆర్‌ఎం ఎం.రాజశేఖర్ తెలిపారు. నల్లగొండ బైపాస్ వద్ద ఏర్పాటు చేసిన స్టాప్‌లో నల్లగొండ, మిర్యాలగూడ నుంచి హైదరాబాద్‌కు వెళ్లే నాన్‌స్టాప్ బస్సుల కోసం ఈ ప్రత్యేక స్టాప్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం 4.30 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఈ సౌకర్యం ఉంటుందని తెలిపారు.

10 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

చిట్యాలరూరల్, సెప్టెంబరు 12: అనుమతులు లేకుండా రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న ఆటోలను చిట్యాల పోలీసులు పట్టుకున్నారు. ఈ సంఘటన చిట్యాల మండలం పేరేపల్లిలో జరిగింది. ఎస్‌ఐ నకిరేకంటి ధర్మ తెలిపిన వివరాల ప్రకారం పేరేపల్లి శివారులో రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారని విశ్వసనీయ సమాచారం చిట్యాల పోలీసులు తనిఖీలు చేపట్టారు. యాదాద్రి-భువనగిరి జిల్లా భువనగిరి మండలం పాచర్లబోడు తండాకు చెందిన ధరావత్ తరుణ్ గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి బియ్యాన్ని కొనుగోలు చేసి విక్రయిస్తుంటాడు. మహీంద్ర వాహనంలో సుమారు 7 క్వింటాళ్ల రేషన్‌బియ్యం, మరో వాహనంలో 3 క్వింటాళ్ల రేషన్ బియ్యం మొత్తం 10 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ధర్మా తెలిపారు.

సంక్షిప్త సమాచారం...

తిరుమలగిరి(సాగర్): మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్‌లో ఎన్ఎంఎంఎస్ పరీక్ష రాసే పది మంది విద్యార్థులకు పల్‌రెడ్డి ఫౌండేషన్ అధినేత పల్‌రెడ్డి నరసింహారెడ్డి స్టడీ మెటీరియల్స్, బ్యాగులను పంపిణీ చేశారు. హెచ్‌ఎం శ్రీనివాస్ మాట్లాడుతూ స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అమృతయ్య, సరోజినిదేవి, గౌసియా, అనిత, విజయ్‌కుమార్, బాను పాల్గొన్నారు.

మిర్యాలగూడ టౌన్: వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.10వేలు అందించినట్లు హౌస్ ఆఫ్ ప్రేయర్ చైర్మన్ రమాబాయి తెలిపారు. అదనపు కలెక్టర్ పూర్ణచందర్‌కు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో హన్యానాయక్, జనార్దన్, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

త్రిపురారం: మండల కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన షేక్ ఫాతిమా అనారోగ్యంతో మృతి చెందింది. త్రిపురారం మాజీ సర్పంచ్ అనుముల శ్రీనివాస్‌రెడ్డి ఆమె ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు.

శాలిగౌరారం: శాలిగౌరారం మండలం వల్లాల గ్రామంలోని పార్వతీ రామలింగేశ్వరస్వామి ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన గణపతి వద్ద గ్రామస్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో అన్నదాత కోన్‌రెడ్డి జైపాల్‌రెడ్డి, మమత దంపతులు పురోహితులు రామలింగయ్యశర్మ, మాజీ సర్పంచ్ షేక్ ఇంతియాజ్‌అహ్మద్, నాయకులు పాల్గొన్నారు.

శాలిగౌరారం: మండల కేంద్రంలోని రైతులకు భారతీయ మల్టీవేషన్ కంపెనీ సహకారంతో పత్తి, వరి, నిమ్మ పంటల సాగుపై అవగాహన కల్పించారు. రైతులకు శాస్త్రీయ విజ్ఞానం, ఉత్పత్తుల దశల వివరించారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో కంపెనీ ఆర్ఎం నరేష్, డీజీఈ నాగార్జున, సిబ్బంది పాల్గొన్నారు.

మునుగోడు: ఆరు గ్యారెంటీల్లో భాగంగా అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం కింద రూ.500లు చొప్పున రాయితీ గ్యాస్ సిలిండర్ తీసుకుంటున్న లబ్ధిదారులకు మంజూరైన ప్రొసైడింగ్ పత్రాలను అందజేయాలని తహసీల్దార్ నరేందర్ రేషన్‌డీలర్లకు సూచించారు. గ్యాస్ రాయితీ ప్రొసిడింగ్ పత్రాలను మండల పరిధిలోని రేషన్ డీలర్లకు అందజేశారు. సమావేశంలో సంఘం మండల అధ్యక్షుడు ఉడుత సైదులు, డీలర్లు పాల్గొన్నారు.

మిర్యాలగూడ: మండలంలోని అవంతీపురం గురుకుల బాలుర పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ నవీన్‌కుమార్ తెలిపారు. కలకంటి శివ, పుట్ట రుత్విక్ నిర్మల్‌లో జరగనున్న పోటీలకు ఎంపిక కావడం గర్వకారణమని పేర్కొన్నారు.

నాగార్జునసాగర్: రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు సాగర్ బీసీ గురుకుల పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ రాజశేఖర్ తెలిపారు. అండర్ -14 విభాగంలో అశోక్, అనిల్ రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులు ఈ నెల 14,15,16 తేదీల్లో వరంగల్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను పీడీ అరుణ, పీఈటీ నర్సింహ, పీడీ విజయ్ అభినందించారు.

దేవరకొండ: దేవరకొండ పట్టణంలోని గాంధీబజార్ ప్రభుత్వ స్థలంలో వెజిటేరియన్, నాన్‌వెజిటేరియన్ మార్కెట్ ఏర్పాటు చేయాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు గుండాల అంజయ్యయాదవ్ కోరారు.

కనగల్: పీఆర్‌టీయూ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. నల్లగొండలో జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా వేమిరెడ్డి సైదిరెడ్డి, గుర్రం కేశవులు, అసోసియేట్ ప్రెసిడెంట్ రామకృష్ణారెడ్డి, గౌరవఅధ్యక్షుడు వెంకటేశం, ఉపాధ్యక్షులు, కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు.

కొండమల్లేపల్లి: జడ్చర్ల-కోదాడ జాతీయ రహదారిపై కొండమల్లేపల్లి మండలంలో మూడు చోట్ల కొండమల్లేపల్లి ఎస్‌ఐ రామ్మూర్తి ఆధ్వర్యంలో వేగ నియంత్రణ కోసం బుల్లోడ్స్ ఏర్పాటు చేశారు. మండలంలోని పెండ్లిపాకల ఎక్స్‌రోడ్డు, చిన్నఅడిశర్లపల్లి గ్రామ పరిధిలోని శివగణేష్ కాటన్ మిల్లు సమీపంలో, పోలీస్‌స్టేషన్ వద్ద వేగ నియంత్రణ బుల్లోడ్స్ ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ప్రమాదాల నివారణకు వాహనదారులు పోలీసులకు సహకరించాలని ఎస్‌ఐ కోరారు.

కొండమల్లేపల్లి: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుని వద్ద లడ్డూను వేలంపాట నిర్వహించగా కాలనీకి చెందిన అందుగుల వెంకటేష్, పూజ దంపతులు రూ.20,516కు దక్కించుకున్నారు. అనంతరం గణనాథుడిని నిమజ్జనం కోసం శ్రీశైలం తీసుకెళ్లారు. కార్యక్రమంలో వెంకటేష్, వస్కుల శ్రీను, తిరుపతయ్య, బాలకృష్ణ, ప్రవీణ్, సైదులు పాల్గొన్నారు.

చిట్యాలరూరల్: చిట్యాల మండలంలోని గుండ్రాంపల్లిలో తెలంగాణ కాలనీలో ఏర్పాటు చేసిన గణపతి ప్రతిమ వద్ద కాలనీవాసులు ప్రత్యేకంగా గణపతి హోమాన్ని నిర్వహించారు. ప్రజలకు గణనాథుడి ఆశీస్సులు ఉండాలని, వరద బాధితులకు కరుణాకటాక్షాలు, ధైర్యం ప్రసాదించాలని ఆకాంక్షిస్తూ కాలనీవాసులు హోమం నిర్వహించారు.

త్రిపురారం: మండలంలోని దుగ్గేపల్లి గ్రామానికి చెందిన యూత్ కాంగ్రెస్ నాయకుడు పొలగాని వెంకట్‌గౌడ్ టీపీసీసీ నూతన అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం శాలువాతో సత్కరించారు.

కట్టంగూరు: గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నిర్వహించే గణేష్ నిమజ్జనం రోజున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు అపశృతి జరగకుండా చూడాలని ఎస్‌ఐ ఎన్.శ్రీను అన్నారు. కట్టంగూరులో పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయా గ్రామాల్లో వినాయకులను నిమజ్జనం చేసేటప్పుడు కార్యదర్శులు ఆ ప్రదేశంలో ఉండాలని సూచించారు.

మిర్యాలగూడ: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని మిర్యాలగూడ జిల్లా సాధన సమితి స్టీరింగ్ కమిటీ సభ్యులు డా.రాజు, మారం శ్రీనివాస్, దశరథ్‌నాయక్ కోరారు. జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో సబ్‌కలెక్టర్ నారాయణ అమిత్‌ను సన్మానించారు. పేద విద్యార్థుల కోసం 100 నోటు పుస్తకాలు, పెన్నులు అందజేశారు.

మాడ్గులపల్లి: మండలంలోని గాయం లక్ష్మీరంగారెడ్డికి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.21వేల విలువైన చెక్కును కాంగ్రెస్ గ్రామ నాయకులు ఆయనకు అందజేశారు.